Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 | సంచిక : 124 | పేజీలు 8 | వెల : 5 | గురువారం 27 నవంబర్ 2025






బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ కు
## త్వరలో కార్యరూపం

2 లో



# గ్రామాలకు పల్లెపండుగ 2.0

### రూ. 6787 కోట్లతో అభివృద్ధి
### ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్



అమరావతి: 'రాష్ట్రంలోని గ్రామాల ముఖచిత్రాన్ని సంపూర్ణంగా మార్చివేసే లక్ష్యంతో 'పల్లె పండగ 2.0' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామ'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా 4 వేల కిలోమీటర్లు రోడ్లు నిర్మించినట్లే, పల్లె పండగ 2.0లో రెండింతల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. పల్లె పండగ 2.0 కార్యక్రమం ద్వారా 13,326 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.6,787 కోట్ల వ్యయంతో 53,382 అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం శివకోడులో పల్లె పండగ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించారు. బహిరంగసభలో మాట్లాడారు. పల్లె పండగ విజయం ఇచ్చిన స్ఫూర్తిని కొనసాగిస్తూ పల్లె పండగ 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పవన్ తెలిపారు. పల్లె పండగ 1.0 కార్యక్రమం ద్వారా రూ. 2,525 కోట్ల విలువైన పనులు టైం బౌండ్ విధానంలో పూర్తి చేశాం. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించాం. పాడి రైతుల కోసం 22,500 మినీ గోకులాలు ఏర్పాటు చేశాం. మూగజీవాల దప్పిక తీర్చడానికి 15 వేల నీటి తొట్టెలు నిర్మించాం. లక్షకు పైగా నీటి కుంటలు ఏర్పాటు చేశాం. ఇప్పుడు పల్లె పండగ 2.0 కార్యక్రమం ద్వారా రూ. 5,838 కోట్ల అంచనా వ్యయంతో 8,571 కిలోమీటర్ల కొత్త రహదారులు నిర్మిస్తున్నామని తెలిపారు. పాత రహదారులకు పునర్నిర్మాణం చేయబోతున్నాం. రూ. 375 కోట్ల వ్యయంతో 25 వేల మినీ గోకులాలు, రూ. 16 కోట్ల అంచనాతో 157 కమ్యూనిటీ గోకులాలు ఏర్పాటు చేస్తాం. రూ. 4 కోట్ల వ్యయంతో 58 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశాం. పంచాయతీల పరిధిలో రూ. 406 కోట్లతో 15 వేల కొత్త అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. రూ.148 కోట్లతో డీపీఆర్సీ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం చేయనున్నాం. వీటితోపాటు కోనసీమకు అదనంగా మరో రూ.100 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనను ఒకసారి గుర్తు చేసుకుంటే గుంతలుపడ్డ రోడ్లు, మరమ్మతులు నోచుకోని కాలువలు, పాలనపై ప్రశ్నిస్తే పెట్టిన అక్రమ కేసులు గుర్తుకొస్తాయి.

# ఆడపిల్లల్లా ఏడవవద్దు

**మహిళలను కించపరిచేలా ధోరణులు**
**మహిళల వ్యక్తిత్వ హననాన్ని అరికట్టాలి**
**ఎమ్మెల్యే అవుతానని చెప్పి గెలిచా**
**ఓటు హక్కు వజ్రాయుధంలాంటిది**
**ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి**
**ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు**
**అమరావతిలో 'మాక్ శాసనసభ'**
**అసెంబ్లీలో అదరగొట్టిన విద్యార్థులు**

అమరావతి:సమాజంలో మహిళలను కించపరిచేలా, వారి వ్యక్తిత్వాన్ని హననం చేసేలా సాగుతున్న ధోరణులకు అడ్డుకట్ట పడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో హద్దులు లేకుండా కొందరు మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారని, ఈ దుష్ప్రచారాన్ని ధైర్యంగా ఎదుర్కొనే శక్తి నేటి ఆడపిల్లలకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. 'ఆడపిల్లల్లా ఏడవద్దు', 'గాజులు తొడుక్కున్నావా' వంటి అవమానకరమైన మాటలను సమాజం నుంచి పూర్తిగా తొలగించాలని ఆయన హితవు పలికారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్ పాఠశాల శాసనసభ' (మాక్ అసెంబ్లీ) కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం మొదటి నుంచి కట్టుబడి ఉందని గుర్తుచేశారు. స్వర్గీయ ఎన్టీఆర్ ఆస్తిలో మహిళలకు సమాన హక్కు కల్పించి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని, మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేశారని అన్నారు.



## సీఐడీ విచారణకు హాజరైన మాజీ ఏఈవో ధర్మారెడ్డి

హైకోర్టు ఆదేశాలతో కేసును దర్యాప్తు చేస్తున్న సీఐడీ

అమరావతి: తిరుమల శ్రీవారి పరకామణి డాలర్ల చోరీ కేసు విచారణలో భాగంగా టీటీడీ మాజీ అదనపు ఈవో ధర్మారెడ్డి ఈరోజు సీఐడీ ఎదుట హాజరయ్యారు. విజయవాడలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో ఏడీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలోని అధికారులు ఆయన్ను విచారిస్తున్నారు. ఈ కేసులో భాగంగానే టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని నిన్న సీఐడీ అధికారులు ప్రశ్నించిన విషయం తెలిసిందే. 2023 ఏప్రిల్ 7న తిరుమల పరకామణిలో 920 అమెరికన్ డాలర్లను సీనియర్ అసిస్టెంట్ రవికుమార్ చోరీ చేస్తూ పట్టుబడ్డారు. అప్పట్లో టీటీడీ విజిలెన్స్ విభాగంలో ఎస్సైగా ఉన్న సతీశ్ కుమార్ ఫిర్యాదుతో తిరుమల ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అదే ఏడాది మే 30న రవికుమార్‌పై చార్జ్‌షీట్ కూడా దాఖలు చేశారు. అయితే, తదనంతర పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు దర్యాప్తును సీఐడీ చేపట్టింది. డిసెంబర్ 2వ తేదీలోగా దర్యాప్తు నివేదికను సమర్పించాల్సి ఉంది. ఈ కేసులో అత్యంత కీలకమైన విషయం ఏమిటంటే, తొలుత ఫిర్యాదు చేసిన ఎస్సై సతీశ్ కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ కేసుకు సంబంధించి విచారణ కోసం రైలులో తిరుపతి వస్తుండగా, ఆయన రైల్వే ట్రాక్‌పై శవమై కనిపించడం ఇటీవల తీవ్ర కలకలం రేపింది. ఈ నేపథ్యంలో సీఐడీ విచారణలో పలువురు ఉన్నతాధికారులను ప్రశ్నిస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# గ్రీవెన్స్ పై ఎమ్మెల్యేలు అలసత్వం

**23 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులకు నోటీసులు**

**నారా లోకేష్ సంచలన నిర్ణయం**



అమరావతి: తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రటరీ, మంత్రి నారా లోకేశ్ జోనల్ కో-ఆర్డినేటర్లతో మంగళవారం మంగళగిరిలోని పార్టీ హెడ్‌క్వార్టర్స్‌లో సమావేశం నిర్వహించారు. పార్టీపై నిర్లక్ష్యం, కార్యకర్తలను పట్టించుకోని నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసిన లోకేశ్, గ్రీవెన్స్ మీటింగులు నిర్వహించని 23 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులకు ఫార్మల్ నోటీసులు జారీ చేయాలని జోనల్ ఇన్‌చార్జ్‌లకు ఆదేశించారు. మంత్రులు, ఎమ్మెల్యేల్లో నిర్లక్ష్యం వద్దని నారా లోకేష్ స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలందరికీ న్యాయం చేయడం తన బాధ్యత అని స్పష్టం చేశారు. డిసెంబర్ 1 నుంచి పార్టీ శ్రేణులకు శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. అదే సమయంలో, 10 రోజుల్లో పార్టీ కమిటీల నియామకాలు పూర్తి చేయాలని, అంతకు ముందు అన్ని పెండింగ్ పోస్టులు భర్తీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు నాయకులు కార్యకర్తలను, ప్రజలను విస్మరిస్తున్నారని లోకేష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రీవెన్స్ డేస్ నిర్వహించకపోవడం, ప్రజా దర్బార్‌లు ఏర్పాటు చేయకపోవడం తీవ్రమైన నిర్లక్ష్యంమన్నారు. ఇలాంటి 23 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులు గుర్తించామని.. వారికి జోనల్ కో-ఆర్డినేటర్లు వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. క్రమశిక్షణా చర్యలు తీసుకునే ముందు ఇది ముందస్తు హెచ్చరిక అని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలు ఎక్కువ మంది మంగళగిరి ప్రజా దర్బార్‌కు రావడం ఎందుకని ప్రశ్నించిన లోకేశ్, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలో వారాంతాపు గ్రీవెన్స్ మీటింగులు నిర్వహించాలని, మంత్రులు కూడా టీడీపీ కార్యాలయం గ్రీవెన్స్ సెషన్లలో పాల్గొనాలని సూచించారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్టపడిన కార్యకర్తలను మరచిపోకూడదన్నారు.



## భయాన్ని బలహీనపరుస్తున్నారు

పదేపదే రాయితీలు ఇవ్వడమేంటి?
రాయితీలు ఇవ్వడం సరికాదు
ట్రాఫిక్ క్రమశిక్షణరాహిత్యాన్ని పెంచుతుంది
ట్రాఫిక్ చలాన్ల డిస్కౌంట్లపై హైకోర్టు ఆగ్రహం

2 లో



2 లో

## కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావు

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

## పాకిస్తాన్ జైల్లో ఇమ్రాన్ ఖాన్ హత్య..!!

**ఆఫ్ఘన్ మీడియా సంచలన ప్రకటన**
**ఆరోపణలను ఖండించిన పాకిస్తాన్**

అఫ్ఘాన్ న్యూస్ వెబ్‌సైట్ 'అఫ్ఘానిస్తాన్ టైమ్స్' మంగళవారం రాత్రి సంచలన ప్రకటన చేసింది. "పాకిస్తాన్‌లోని విశ్వసనీయ మూలాలు తెలిపిన సమాచారం ప్రకారం, పీటీఐ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్‌ను అడియాలా జైలులో రహస్యంగా చంపేశారు. అతని శవాన్ని జైలు నుంచి బయటకు తరలించారు"



2 లో

# తడిగుడ్డతో బీసీల గొంతు కోస్తున్న రేవంత్



కడియంకు దమ్ముంటే రాజీనామా చేయాలి: కేటీఆర్

హనుమకొండ: బీసీలకు చట్టసభల్లో 42 శాతం వాటా కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో కేవలం 17 శాతమే రిజర్వేషన్లు కల్పించి తడిగుడ్డతో గొంతుకోస్తూ మోసం చేస్తున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధ్వజమెత్తారు. హనుమకొండలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అధ్యక్షతన జరిగిన 'దీక్షా దివస్' సన్నాహక సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఇదే అంశంపై జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల భారత రాష్ట్ర సమితి శ్రేణులతో జనగామలోనూ మాట్లాడారు. నాడు కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి బీసీలు 51 శాతం మంది ఉన్నారని తేల్చితే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే పేరిట వారి సంఖ్య తగ్గించి 46 శాతంగా వెల్లడించిందన్నారు. నాటి ఉద్యమ స్ఫూర్తితో కార్యకర్తలు స్థానిక ఎన్నికల్లో పోరాడాలని పిలుపునిచ్చారు. స్టేషన్‌ఘన్‌పూర్‌ను కడియం శ్రీహరి పట్టుకువేలాడుతున్నారని.. దమ్ముంటే ఆయన రాజీనామా చేయాలని కేటీఆర్ సవాల్ విసిరారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, తాటికొండ రాజయ్య, సత్యవతి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



# దూసుకొస్తున్న సెన్యార్ తుఫాన్

**తుపాన్‌గా బలపడిన తీవ్రవాయుగుండం.**
**ఏపీకి వర్ష సూచన.. పలు జిల్లాలకు అలర్ట్**
**మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని వార్నింగ్**
**తుపాను ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలు**

మలక్కా జలసంధి ప్రాంతంలో సెన్యార్ తుపాన్ గా బలపడిన తీవ్రవాయుగుండం. ఈ తుపానుకు 'సెన్యార్'గా నామకరణం చేశారు. 24 గంటల తర్వాత క్రమంగా బలహీనపడే అవకాశం ఉంది. విశాఖపట్నం, కోనసీమ, ఉత్తర తమిళనాడు ప్రాంతాల్లో 5 నుంచి 10 సెం.మీ. వర్షపాతం నమోదు కావొచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది.



2 లో

## ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుండి ప్రారంభం

విద్యార్థుల వివరాల్లో పొరపాట్ల సవరణకు బోర్డు కొత్త మార్గదర్శకాలు
30 వరకు నామినల్ రోల్స్ లో తప్పులు సరిచేసుకునే అవకాశం
తల్లిదండ్రులకు మెసేజ్‌లు పంపనున్న ఇంటర్ బోర్డు
విద్యార్థులకు అలర్ట్.. బోర్డు కొత్త మార్గదర్శకాలు..!

## జనాభా లెక్కలకు భిన్నంగా రిజర్వేషన్లు

**హైకోర్టులో కేసు దాఖలు**

హైదరాబాద్ : తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు నగారా మోగింది. ఈ నేపథ్యంలో పంచాయతీ రిజర్వేషన్లపై పలువురు గ్రామస్తులు బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. బీసీ జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించలేదంటూ ఒకరు పిటిషన్ వేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ తిమ్మనోనిపల్లి రిజర్వేషన్లపై మరో పిటిషన్ దాఖలైంది. వార్డులన్నింటిని ఎస్సీ, ఎస్టీలకే కేటాయించారంటూ ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల కంటే బీసీల జనాభా అధికంగా ఉందంటూ ఇంకో పిటిషనర్ ఆరోపించారు.సంగారెడ్డి జిల్లాలో పలు గ్రామాల్లో సరైన రిజర్వేషన్ల పాటించడం లేదంటూ ఆంధోల్ మండలం రామసానిపల్లికి చెందిన మాజీ సర్పంచు ఆగమయ్య పిటిషన్ దాఖలు చేశారు. రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం జీఓ 46 తీసుకొచ్చిందని పిటిషనర్ పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 613 గ్రామ పంచాయతీలు ఉన్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కానీ బీసీలకు 117 సర్పంచు స్థానాలనే రిజర్వు చేశారని చెప్పారు.సంగారెడ్డి జిల్లాలో బీసీ రిజర్వేషన్లు 19 శాతమే ఉందని పిటిషనర్ న్యాయవాది వెల్లడించారు. సంగారెడ్డి కలెక్టర్ జారీ చేసిన గెజిట్‌ను రద్దు చేసి మళ్లీ రిజర్వు చేసేలా ఆదేశించాలని కోర్టును పిటిషనర్ కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 17శాతం రిజర్వేషన్లు వస్తున్నాయని పిటిషనర్ పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 46కు ఈ రిజర్వేషన్లు విరుద్ధంగా ఉన్నాయని మరో పిటిషనర్ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్లను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవిదేవి బుధవారం విచారణ చేపట్టారు. తదపరి విచారణను రేపటికి అంటే.. గురువారానికి వాయిదా వేశారు.

# భయాన్ని బలహీనపరుస్తున్నారు



హైదరాబాద్: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రభుత్వం ఈ మధ్య వాహనాల రకాన్ని బట్టి.. 75 నుంచి 25 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తున్న విషయం తెలిసిందే. పేరుకుపోయిన పెండింగ్ చలాన్ల బకాయిలను రికవరీ చేసుకునేందుకు.. ప్రభుత్వం అప్పుడప్పుడు డిస్కౌంట్లు ఇస్తుంటుంది. ఇలా డిస్కౌంట్లు ఇవ్వడం వల్ల చట్టపరమైన పరిణామాల పట్ల ప్రజల్లో ఉన్న భయం, గౌరవం బలహీనపడతాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. ముఖ్యంగా.. రాయితీలు ట్రాఫిక్ క్రమశిక్షణారాహిత్యాన్ని మరింత పెంచుతాయని, ప్రజలు నిబంధనలను ఉల్లంఘించినా ఏదో ఒక దశలో రాయితీ లభిస్తుందనే భావన పెరిగే అవకాశం ఉందని కోర్టు పేర్కొంది. ఈ-చలానా వ్యవస్థలో మార్పులు చేసి, ఉల్లంఘన వివరాలను స్పష్టంగా పొందుపరచాలని ఆదేశించింది.ఇంటిగ్రేటెడ్ ఈ-చలానా వ్యవస్థను సవాల్ చేస్తూ హైదరాబాద్ తార్నాకకు చెందిన వి. రాఘవేంద్రచారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ విచారించారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదిస్తూ.. ట్రిపుల్ రైడింగ్‌కు 1988 మోటారు వాహనాల చట్టం సెక్షన్ 128 రెడ్‌విత్ 177 ప్రకారం.. రూ. 100 నుంచి రూ. 300 మాత్రమే జరిమానా విధించాలి. కానీ దీనికి విరుద్ధంగా 2019 నిబంధన ప్రకారం.. రూ. 1000 విధిస్తున్నారని.. ఇది చెల్లదని వాదించారు. 2019లో సవరణ నిబంధనలను తెలంగాణ ప్రభుత్వం అన్వయించుకోకపోవడంతో.. 1988 నిబంధనల ప్రకారమే చలానా జారీచేయాల్సి ఉందన్నారు ప్రభుత్వ న్యాయవాది మహేశ్ రాజె తమ వాదనలు వినిపించారు. మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 200 కింద ట్రాఫిక్ ఉల్లంఘనలనేవి జరిమానా విధించదగ్గ నేరాలని తెలిపారు. అందుకు సంబంధించిన జరిమానాల వివరాలను వెల్లడిస్తూ ప్రభుత్వం 2007 జీవో 54 జారీ చేసిందని హైకోర్టుకు తెలిపారు. హైకోర్టు సూచనల మేరకు ప్రభుత్వం జరిమానాను పెంచుతూ 2011లో ఉత్తర్వులు జారీ చేసిందని.. ప్రస్తుత చలానా వ్యవస్థలో నిబంధనలన్నీ పొందుపర్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ట్రాఫిక్ ఉల్లంఘన జరిగినప్పుడు అది ఏ చట్టంలోని ఏ సెక్షన్ కింద ఉల్లంఘనగా పరిగణించబడిందనే వివరాలను చలానా జారీ సమయంలో స్పష్టంగా పొందుపరచగలిగే వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు తీసుకున్న చర్యలు, వ్యవస్థ అభివృద్ధి ఏ దశలో ఉందో సమగ్ర నివేదికను డిసెంబర్ 9వ తేదీలోగా సమర్పించాలని హైకోర్టు హోంశాఖను ఆదేశించింది. ఈ సాంకేతిక మెరుగుదల కేంద్ర మోటారు వాహన నిబంధన 167 ప్రకారం తప్పనిసరి అని న్యాయమూర్తి గుర్తు చేశారు.

## ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుండి ప్రారంభం

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఇంటర్ బోర్డు పరీక్షల పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో, ప్రతీ సంవత్సరం పరీక్ష ఫీజు చెల్లింపు సమయంలో విద్యార్థుల వ్యక్తిగత వివరాలు, విద్యా సంబంధిత వివరాలు తప్పుగా నమోదు కావడం ఒక పెద్ద సమస్యగా మారుతోంది. పేరు, తండ్రి పేరు, గ్రూపు, మాధ్యమం, భాషా సబ్జెక్టులు వంటి కీలక అంశాల్లో తేడాలు రావడం వల్ల పరీక్ష సమయాన విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటారు.గతంలో పరీక్ష కేంద్రాల్లోనే విద్యార్థులు ఓఎంఆర్ పత్రాల్లో తప్పులు సవరించుకునే అవకాశం ఉండేది. చాలా సందర్భాల్లో తెలుగు స్థానంలో హిందీ ముద్రించబడడం, గ్రూప్ మారడం, తల్లిదండ్రుల పేర్లు తప్పుగా రావడం వంటి సమస్యల్ని అప్పటికప్పుడు సరిచేసుకునే అవకాశం ఉండేది. అయితే ఈసారి పరీక్ష కేంద్రాల్లో అలాంటి అవకాశం ఉండదని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. దీనికి బదులుగా, ఈ విద్యా సంవత్సరం నుంచి పరీక్షలకు ముందుగానే వివరాల సవరణకు అవకాశం కల్పించనుంది. ఇందుకోసం డీఐఈవోలకు మరియు కాలేజీ ప్రిన్సిపాళ్లకు బోర్డు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థికి కాలేజీ ప్రిన్సిపాళ్లు నామినల్ రోల్స్‌ను చూపించి, అందులో ఉన్న అన్ని వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా కాలేజీలకు పిలిపించి వివరాలను క్రాస్ చెక్ చేయించి సంతకాలు తీసుకోవాలని సూచించింది. ఈ ప్రక్రియ ద్వారా ఓఎంఆర్ పత్రాల్లో వచ్చే పొరపాట్లను ముందుగానే పూర్తిగా నివారించవచ్చని బోర్డు భావిస్తోంది. అంతేకాక, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్ కాలేజీల్లో చదువుతున్న దాదాపు 10 లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రులకు పరీక్షల ఫీజులు, గడువులు, నామినల్ రోల్స్ పరిశీలన, ప్రాక్టికల్స్ షెడ్యూల్ వంటి సమాచారాన్ని ఎస్ఎంఎస్‌ల రూపంలో పంపించాలనే నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే పరీక్షల ఫీజు చెల్లించిన విద్యార్థులకు నవంబర్ 30 వరకు తమ నామినల్ రోల్స్‌లో ఉన్న పొరపాట్లను సవరించుకునే అవకాశం కల్పించింది. ఫీజు గడువు ముగిసిన తరువాత కూడా మరోసారి సవరణ అవకాశం ఇవ్వనున్నట్లు బోర్డు తెలిపింది.ప్రస్తుతం 92!! మంది విద్యార్థులు ఇప్పటికే పరీక్ష ఫీజులు చెల్లించడంతో, వివరాల ధృవీకరణ ప్రక్రియ త్వరగా పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ విధంగా, ఇంటర్ బోర్డు విద్యార్థుల వివరాలను ఖచ్చితంగా సరిచేసుకునే అవకాశం అందించి, పరీక్షల సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను ముందుగానే నివారించడానికి చర్యలు చేపట్టింది.

## కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా.

హైదరాబాద్: అధికార కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెలను గ్రామాల్లో కూల్చివేయాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల అంశంపై అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు.పంచాయతీ ఎన్నికల్లో..అన్ రిజర్వుడు స్థానాల్లో అన్ని చోట్లా నామినేషన్లు వేయాలని బీసీలకు ఆమె సూచించారు. 42 శాతం రిజర్వేషన్లలో ప్రధాన దోషి బీజేపీ అని ఆరోపించారు. బీసీలకు మోసం జరుగుతుంటే..ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి రియాక్షన్ లేదని విమర్శించారు. ప్రతిపక్షం గురించి తాను మాట్లాడనని.. మాట్లాడితే బద్నాం చేస్తారన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ పోరాటం చేసిందేమీ లేదని కుండ బద్దలు కొట్టారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సరిగ్గా జరగలేదన్నారు. అందుకే బీసీలకు రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరిగిందని తెలిపారు. మంత్రులు,ఎమ్మెల్యేల ప్రమేయంతోనే ఈ రిజర్వేషన్లు ఖరారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని స్వయంగా జిల్లా కలెక్టర్లే చెబుతున్నారన్నారు. బీసీ జనాభాను కావాలని కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ చేసి చూపిందని పేర్కొన్నారు. జిల్లాల వారీగా 5 శాతానికి పైగా బీసీ జనాభా తగ్గించి చూపించారని చెప్పారు.21శాతం మాత్రమే బీసీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇచ్చిందని గుర్తు చేశారు. పంచాయతీ ఎన్నికలతో జనం బాట కార్యక్రమంలో స్వల్ప మార్పులు చేశామని చెప్పారు. పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు గ్రేటర్ పరిధిలో జనం బాట కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. తనపై బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వరరెడ్డి ఎందుకు స్పందిస్తున్నారో అర్థం కాలేదన్నారు.
ఏదైనా ఆరోపణలు చేస్తే.. అర్థం పర్థం ఉండాలని పేర్కొన్నారు. తాను ఎవరిపైనో ఆరోపణలు చేస్తే.. మహేశ్వరరెడ్డి తనపై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. తన ఆరోపణలపై స్పందించి.. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మంచి ఒరవడికి శ్రీకారం చుట్టారని అభిప్రాయపడ్డారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆక్రమించిన భూమి తనకెందుకని ప్రశ్నించారు. ఆ భూమిని ప్రజలకు ఇస్తే సరిపోతుందని కవిత తెలిపారు.

# సర్వీస్ రివాల్వర్ అమ్మేసిన ఎస్ఐ!

హైదరాబాద్: ఇటీవల ఓ పోలీస్ నిందితుడ్ని వదిలిపెట్టేందుకు అతడి వద్ద నుంచి ఏకంగా రూ.2 కోట్లు తీసుకోవడం దుమారం రేపింది. తాజాగా మరో పోలీస్ అధికారి తన సర్వీస్ రివాల్వర్‌ను అమ్మేయడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. హైదరాబాద్ లోని అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఘటన రాష్ట్ర పోలీసు విభాగంలో తీవ్ర కలకలం సృష్టించింది. సర్వీస్ రివాల్వర్‌ను ఎక్కడైనా తాకట్టు పెట్టి ఉంటాడన్న కోణంలోనూ విచారణ జరుగుతోంది. పోలీస్ స్టేషన్ లాకర్‌లో భద్రపరచాల్సిన దొంగల నుంచి రికవరీ చేసిన బంగారంతో పాటు, ఎస్సైకి కేటాయించిన సర్వీస్ తుపాకీ (రివాల్వర్) కూడా కనిపించకుండా పోవడం గమనార్హం. ఈ వస్తువులు అదృశ్యం కావడంతో, ఉన్నతాధికారులు కేసు నమోదు చేయించి, వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. 2020 బ్యాచ్‌కు చెందిన ఎస్సై భానుప్రకాష్ హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పలు పీఎస్‌లో పనిచేశాడు. ప్రస్తుతం అంబర్‌పేట్ పీఎస్ క్రైం ఎస్సైగా ఉన్నాడు. ఆ సమయంలో ఓ కేసులో రికవర్ చేసిన నాలుగు తులాల బంగారాన్ని తన డ్రాలో పెట్టాడు. కొన్ని రోజులకు అవి తీసి అమ్మేశాడు. బంగారాన్ని వాటి యజమానికి అప్పగిస్తానని చెప్పి నమ్మించి లోక్ అదాలత్‌లో కేసును క్లోజ్ చేయించాడు. కానీ వారికి ఎస్సై భాను ప్రకాష్ బంగారాన్ని తిరిగివ్వలేదు. ఉన్నతాధికారులకు విషయం తెలియడంతో అతడి మీద కేసును నమోదు చేసి సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.భాను ప్రకాష్ చెక్ చేసి చూడగా అందులో సర్వీస్ రివాల్వర్ లేదని గుర్తించారు. కేవలం 9ఎంఎం బుల్లెట్లు కొన్ని ఉన్నాయని, ఇటీవల రికవరీ చేసిన బంగారం కూడా లేదని స్టేషన్ పోలీసులు ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లగా వారి ఆదేశాలతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఎస్ఐ భాను ప్రకాష్ తన వ్యక్తిగత ఆర్థిక అవసరాల కోసం ఈ వస్తువులను విక్రయించి ఉంటాడని పోలీసుల ప్రాథమిక విచారణలో భావిస్తున్నారు. ఎస్ఐ భానుప్రకాష్ ఆర్థిక సమస్యలకు కారణంగా బెట్టింగ్ అని తెలుస్తోంది. అతడు గ్రూప్ 1, గ్రూప్ 2 పోస్టులకు ప్రిపేర్ అవుతున్నానని చెప్పి తరచుగా సెలవులు తీసుకునేవాడని పోలీసులు తెలిపారు. బెట్టింగ్ లో అతడు అరకోటి రూపాయల పైగా నష్టపోయాడని, దాంతో ఆర్థిక సమస్యలు అతడ్ని వెంటాడాయి. ఈ క్రమంలో భానుప్రకాష్ ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసు శాఖ ఇచ్చిన సర్వీస్ రివాల్వర్‌ను ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు విక్రయించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసుల్లో రికవరీ చేసిన బంగారాన్ని సైతం వాటి యజమానికి ఇవ్వకుండా తానే విక్రయించి సొమ్ము చేసుకున్నాడని ప్రాథమిక విచారణలో తేలుతున్నాయి. ఇంతకీ సర్వీస్ రివాల్వర్ ఎవరికి విక్రయించాడు అనే కోణంలో విచారణ చేపట్టారు. పోలీసు శాఖ నిబంధనలు పాటించకపోగా, రూల్స్ ఉల్లంఘిస్తూ రివాల్వర్ అమ్మేయడంపై డిపార్ట్‌మెంట్ సీరియస్‌గా ఉంది. త్వరలోనే అతడిపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## దూసుకొస్తున్న సెన్యార్ తుఫాన్

అమరావతి: నైరుతి బంగాళాఖాతం, దక్షిణ శ్రీలంక, హిందూ మహాసముద్రం మీదుగా అల్పపీడనం కొనసాగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.ఇది రాబోయే 12 గంటల్లో ఉత్తర- వాయువ్య దిశగా కదులుతూ తీవ్రఅల్పపీడనంగా మారే అవకాశం ఉందంది. ఆ తదుపరి 24 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వివరించింది. మలక్కా జలసంధి ప్రాంతంలో సెన్యార్ తుపాన్ గా బలపడిన తీవ్రవాయుగుండం. ఈ తుపానుకు 'సెన్యార్'గా నామకరణం చేశారు. 24 గంటల తర్వాత క్రమంగా బలహీనపడే అవకాశం ఉంది. విశాఖపట్నం, కొనసీమ, ఉత్తర తమిళనాడు ప్రాంతాల్లో 5 నుంచి 10 సెం.మీ. వర్షపాతం నమోదు కావొచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. తమిళనాడులో పలు జిల్లాలకు అలర్ట్ ప్రకటించారు. మలక్కా జలసంధి ప్రాంతాల్లో తీవ్రవాయుగుండం కొనసాగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతూ ఈరోజు తుపానుగా బలపడే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతూ మరింత బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. గురువారం నుంచి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని హెచ్చరించింది.అల్పపీడనం, తుపాను ప్రభావంతో శనివారం నుంచి మంగళవారం వరకు (నవంబర్ 29 నుంచి డిసెంబర్ 2) కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా రైతులు అప్రమత్తమై వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వరి కోతలు జోరుగా సాగుతున్న క్రమంలో వెంటనే కుప్పలు వేసుకోవాలని విపత్తుల నిర్వహణ శాఖ సూచించింది.పండిన ధాన్యాన్ని తడవకుండా భద్రపరచుకోవాలని, తడిసిన గింజలు మొలకెత్తకుండా, నాణ్యత కోల్పోకుండా జాగ్రత్త పడాలి సూచించింది. రంగుమారకుండా ఉండేందుకు పూర్తిగా పట్టాలతో కప్పి ఉంచాలని అన్నదాతలకు సూచించింది.

## పాకిస్తాన్ జైల్లో ఇమ్రాన్ ఖాన్ హత్య..!!



న్యూఢిల్లీ: పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి, పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ పార్టీ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్‌ను అడియాలా జైలులో 'రహస్యంగా' చంపేశారని ఆఫ్ఘాన్ మీడియా ప్రకటించింది. అయితే, పాకిస్తాన్ ప్రభుత్వం, సైనిక అధికారులు ఈ ఆరోపణలను ఖండించారు. ఇమ్రాన్ ఖాన్ బతికే ఉన్నారని చెబుతోంది. ఆఫ్ఘన్ మీడియా చేసిన ప్రచారంతో రావల్పిండిలోని అడియాలా జైలు వద్ద వేలాది మంది పీటీఐ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఆఫ్ఘాన్ న్యూస్ వెబ్‌సైట్ 'అఫ్ఘానిస్తాన్ టైమ్స్' మంగళవారం రాత్రి సంచలన ప్రకటన చేసింది. "పాకిస్తాన్‌లోని విశ్వసనీయ మూలాలు తెలిపిన సమాచారం ప్రకారం, పీటీఐ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్‌ను అడియాలా జైలులో రహస్యంగా చంపేశారు. అతని శవాన్ని జైలు నుంచి బయటకు తరలించారు" అని ఆ వార్తలో పేర్కొన్నారు. ఈ ఆరోపణలు 'కాబుల్ ఫ్రంట్‌లైన్' వంటి ఇతర ఆఫ్ఘాన్ మీడియా ఔట్‌లెట్లలో కూడా విస్తృతంగా ప్రచారం అయ్యాయి. 'పాకిస్తాన్ సైన్యంలోని రహస్య వ్యక్తులు' ఇచ్చిన సమాచారం అని చెప్పుకున్నారు. కానీ ఎలాంటి ఆధారాలు లేవు. పాకిస్తాన్ అధికారులు ఈ ఆరోపణలను 'తప్పుడు వార్త'గా ఖండించారు. "ఇమ్రాన్ ఖాన్ క్షేమంగా ఉన్నాడని.. అతనికి ఎలాంటి హాని జరగలేదు. ఈ రూమర్‌లు ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించడానికి ఉద్దేశించినవి" అని పాకిస్తాన్ సమాచార మంత్రిత్వ శాఖ అధికారులు ప్రకటించారు. అడియాలా జైలు సూపరింటెండెంట్ కూడా ఖాన్ ఆరోగ్యం బాగుందన్నారు. అతను తన ట్విట్టర్ ఖాతాను కూడా జైలు నుంచి నిర్వహిస్తున్నాడనే ఆరోపణలు తప్పు అని ఇస్లామాబాద్ కోర్టులో సోమవారం స్పష్టం చేశారు. పాకిస్తాన్ మొబైల్ ఆపరేటర్లు కూడా ఈ రూమర్‌లు 'ఫేక్ న్యూస్'గా గుర్తించి, వాటిని అడ్డుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ రూమర్ వల్ల పీటీఐ కార్యక్రతలు మండిపడ్డారు. మంగళవారం అడియాలా జైలు వద్ద వేలాది మంది సమావేశమై, ఖాన్ ఆరోగ్యం గురించి సమాచారం కోరుతూ నిరసనలు చేశారు. ఖాన్ సోదరి అలీమా ఖాన్, డాక్టర్ ఉజ్మా, నూరీన్ నియాజీలు జైలు గేటు వద్ద కూర్చుని ధర్నా చేశారు. అయితే, పోలీసులు వారిని బయటకు తీసుకెళ్లారు. 3 రోజులుగా మిమ్మల్ని ఇమ్రాన్ ఖాన్‌తో కలవనీయకుండా ఆపేశారు. అతనికి ఏమైందో తెలుసుకోవాలి అని అలీమా ఖాన్ మీడియా ముందు డిమాండ్ చేశారు. ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి అడియాలా జైలులో ఉన్నారు. అవినీతి, రాష్ట్ర ద్రోహం వంటి 20కి పైగా కేసుల్లో అతనిక శిక్ష విధించారు. గత నెలలో అతను సైనిక అధిపతి అసీమ్ మునీర్‌పై తీవ్రంగా విమర్శించాడు. డెమోక్రసీని చీల్చి, 'అసీమ్ లా'ను రుద్దుతున్నారు" అని ఖాన్ పేరిట జైలు నుంచి ప్రకటన విడుదల చేశారు. అయితే ఈ రూమర్‌ను నమ్మేవాళ్లు ఎక్కువగా ఉన్నారు. ఇమ్రాన్ ఖాన్‌ను బయటకు చూపించాలని డిమాండ్ చేసేవారు పెరుగుతున్నారు.

## మరోసారి తగ్గిన బంగారం ధరలు

న్యూఢిల్లీ: గోల్డ్ లవర్స్ గుడ్ న్యూస్ అని చెప్పాలి. ఎందుకంటే.. గత రెండు, మూడు రోజులుగా బంగారం ధరలు తగ్గుతూ వస్తున్నాయి. పసిడి పరుగులు కాస్త తగ్గించినట్టుగా కనిపిస్తుంది. ఏడాది ఆరంభం నుండి ప్రజల్ని బెంబేలెత్తిస్తూ పరిగెత్తిన పసిడి ఇప్పుడు మెల్లిగా దిగివస్తున్నట్టుగా కనిపిస్తుంది. గత మూడు రోజులుగా బంగారం ధర తగ్గుతూ వచ్చింది. నవంబర్ 24 సోమవారం 24క్యారెట్ల బంగారం 10గ్రాములు రూ. 1,25,130 ఉండగా, అది స్వల్పంగా తగ్గింది. ఈ రోజుకు 1,25,120కి తగ్గింది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,25,660 పలుకుతోంది. అదే 22 క్యారెట్ల ధర రూ.1,15,190 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,70,900 లుగా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,25,120, 22 క్యారెట్ల ధర రూ.1,14690 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,62,900 లుగా ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,25,270, 22 క్యారెట్ల ధర రూ.1,14,840 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,62,900 లుగా ఉంది. విజయవాడలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,25,840, 22 క్యారెట్ల ధర రూ.1,15,350 గా ఉంది. కిలో వెండి ధర రూ.1,70,900 లుగా ఉంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,25,120, 22 క్యారెట్ల ధర రూ.1,14,690 గా ఉంది. కిలో వెండి ధర రూ.1,70,900 లుగా ఉంది. కేరళలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,25,120, 22 క్యారెట్ల ధర రూ.1,14,690 గా ఉంది. కిలో వెండి ధర రూ.1,70,900 లుగా ఉంది. విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,25,120, 22 క్యారెట్ల ధర రూ.1,14,690 గా ఉంది. కిలో వెండి ధర రూ.1,70,900 లుగా ఉంది. విజయవాడలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,25,120, 22 క్యారెట్ల ధర రూ.1,14,690 గా ఉంది. కిలో వెండి ధర రూ.1,70,900
లుగా ఉంది. కాగా.. బంగారం, వెండి ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. అందుకే అన్ని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు. ఇకపోతే, ఇక్కడ పేర్కొన్న బంగారం ధరలు ఉదయం 8 గంటలలోపు అందిన సమాచారం మేరకు మాత్రమే.

## రవి సినిమాలు పైరసీ చేయలేదు

**ఐబొమ్మ కేసులో కొత్త ట్విస్ట్! విచారణలో కీలక విషయాలు వెల్లడి**


హైదరాబాద్:: తెలుగు సినీ పరిశ్రమ ఆర్థిక మూలాలను దెబ్బకొట్టి పైరసీ వెబ్ సైట్ ఐబొమ్మ కేసులో విచారణ వేగంగా కొనసాగుతోంది. ఐదురోజుల పోలీసు కస్టడీలో సైతం నిందితుడు రవి వద్ద నుంచి కీలక సమాచారాన్ని తెలంగాణ పోలీసులు రాబట్టారు. మరి కొన్ని విషయాల్లో ఇంకా క్లారిటీ రావాల్సిన అవసరం ఉంది. తాజా మరో వారం రోజులపాటు పోలీసు కస్టడీ కోరుతూ నాంపల్లికోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఇదిలా ఉంటే కేసులో రోజుకో ట్విస్ట్ వెలుగు చూస్తోంది. తాజాగా నిందితుడు రవి ఏ సినిమాలు పైరసీ చేయలేదంటూ మరో బాంబు పేల్చారు పోలీసులు. ఐబొమ్మ, బప్పం పైరసీ వెబ్ సైట్‌ల ద్వారా చట్టవిరుద్ధంగా సినిమాలను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచడంతోపాటు, ఆయా వెబ్ సైట్ల ద్వారా గేమింగ్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేస్తూ కోట్ల రూపాయలు సంపాదించిన మాట వాస్తవమేనని, కానీ అప్పుడే విడుదలైన కొత్త సినిమాలను పైరసీ చేయడంలో ఐబొమ్మ వెబ్ సైట్ నిర్వాహకుడు రవికి ఎటువంటి ప్రమేయం లేదని తేల్చినట్లు సమాచారం. మూవీ రూల్స్ , తమిళ్ ఎంవీ ద్వారా పైరసీ సినిమాలను కొనుగోలు మాత్రమే రవి చేసేవాడని, అలా కొనుగోలు చేసిన కొత్త సినిమాలు క్వాలిటీ తక్కువగా ఉండేవని, అలా పూర్ క్వాలిటీతో కొన్న పైరసీ సినిమాలను టెక్నాలజీ ఉపయోగించి, హెచ్ డీ క్వాలిటీలోకి మార్చి ఐబొమ్మ, బప్పం వెబ్ సైట్‌లో పోస్ట్ చేసేవాడని తేల్చారు. దీంతో సినిమా పైరసీ కేసుల నుంచి ఐబొమ్మ రవికి కాస్త ఊరట లభించినట్లయ్యింది. కానీ గేమింగ్ యాప్‌లు ప్రమోట్ చేయడం, బెట్టింగ్ యాప్ లను తన వెబ్ సైట్ ల ద్వారా ప్రమోట్ చేయడం ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించడంతో రవి అడ్డంగా బుక్కైనట్లయ్యింది. ఐబొమ్మ రవి పోలీసులకు చిక్కడానికి కారణం తన గొయ్యి తానే తవ్వుకోవడం. తన డొమైన్‌ను తన సొంత అడ్రస్, ఈమెయిల్ ఐడీ, క్రెడిట్ కార్డు ఉపయోగించి కొనుగోలు చేయడమే రవి ఈజీగా ఖాకీలకు చిక్కేలా చేసింది. మొదట ఎన్‌జలా అనే కంపెనీ ద్వారా డొమైన్ రిజస్ట్రేషన్ చేసిన రవి, ఐపీ వాల్యూమ్ అనే కంపెనీ ద్వారా హోస్టింగ్ వ్యవహారాలు మ్యానేజ్ చేసేవాడు. కంటెంట్ మ్యానేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ఈ మొత్తం వ్యవస్థను నడిపించేందుకు ఔట్ సోర్సింగ్ టీమ్ ఏర్పాటు చేసినట్లుగా నిర్ధారించారు. ఇలా వీళ్లెవరికీ రవితో సంబంధాలు లేవు. ఎవరెవరు, ఎక్కడి నుంచి ఎవరి కోసం పని చేస్తున్నారో తెలియకుండా ఈ మొత్తం వ్యవహారం నడిపించాడు.ఐబొమ్మ వెబ్ సైట్‌లోకి వెళ్లి సినిమా లింక్‌పై క్లిక్ చేయగానే వెంటనే యూజర్స్ ను గేమింగ్ యాప్, బెట్టింగ్ యాప్‌లకు రీడైరెక్ట్ చేసేలా బప్పం, ఐబొమ్మ పైరసీ వెబ్ సైట్లను డిజైన్ చేశాడు. అలా యూజర్ ఎంగేజ్మెంట్ ఆధారంగా బెట్టింగ్, గేమింగ్ యాప్ కంపెనీలు రవికి డబ్బులు చెల్లించేవి. లక్ష వ్యూవర్స్‌కు ఇంత మొత్తంలో డబ్బు చెల్లించేలా ముందుగానే మాట్లడుకునేవాడు. అలా ఆయా కంపెనీల నుంచి వచ్చిన డబ్బును ఇండియాలో తన బ్యాంక్ అకౌంట్‌కు మళ్లించేవాడు. అలా వచ్చిన డబ్బును వచ్చినట్లు మంచినీళ్లలా విదేశీ పర్యటనల కోసం ఖర్చు చేసేవాడట. ఇలా పైరసీ సినిమాలు మాత్రమే కొనలేదుకానీ, మిగతా చట్టవిరుద్ధమైన గేమింగ్ యాప్ ప్రమోషన్‌లతో కోట్లు దండుకోవడం నిందితుడి కొంపముంచింది.

## అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగం

న్యూఢిల్లీ: దాదాపు 5 ఏళ్ల తరువాత భారత్, చైనా మధ్య సంబంధాలు కుదట పడుతున్నాయని భావిస్తున్న తరుణంలో మరో వివాదం మొదలైంది. అరుణాచల్ ప్రదేశ్ గురించి చైనా చేసిన రెచ్చగొట్టే ప్రకటనపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చైనాకు సమాధానమిస్తూ.. అరుణాచల్ ప్రదేశ్ భారతదేశంలో అంతర్భాగమని, విడదీయరాని భాగమని అన్నారు. చైనా చేసే ఏ ప్రకటన కూడా ఈ వాస్తవాన్ని మార్చలేదని స్పష్టం చేశారు.అరుణాచల్ ప్రదేశ్ కు చెందిన ఒక భారత పౌరుడిని ఏకపక్షంగా నిర్బంధించినందుకు సంబంధించి చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ చేసిన ప్రకటనలు చూశాం. ఆమెకు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్ ఉంది. షాంఘై అంతర్జాతీయ విమానాశ్రయం నుండి జపాన్‌కు తన తదుపరి ప్రయాణం చేయాల్సి ఉంది. నిర్బంధం సమస్యను చైనాతో గట్టిగా లేవనెత్తాం. అంతర్జాతీయ విమాన ప్రయాణాన్ని నియంత్రించే అనేక నిబంధనలను ఉల్లంఘించిన వారి చర్యపై చైనా అధికారులు ఇంకా మాకు క్లారిటీ ఇవ్వలేదు" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.చైనా అధికారుల చర్యలు తమ దేశ నిబంధనలను కూడా ఉల్లంఘిస్తున్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. అన్ని దేశాల పౌరులకు 24 గంటల వరకు వీసా రహిత ప్రయాణానికి అనుమతిస్తుంది. బ్రిటన్‌లో నివసిస్తున్న భారత పౌరురాలు పేమా వాంగ్‌జోమ్ థోంగ్‌డోక్ నవంబర్ 21న లండన్ నుండి జపాన్‌కు వెళుతున్నారు. ఆమె మూడు గంటల పాటు నిర్ణయించిన స్టాప్ ఒక పీడకలగా మారింది.

ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆమె పాస్‌పోర్ట్‌ను అరుణాచల్ ప్రదేశ్ ఆమె జన్మస్థలం అని రాసి ఉండటం వల్ల చట్టవిరుద్ధమని ప్రకటించారని పేర్కొన్నారు.

## బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ కు త్వరలో కార్యరూపం



**హైదరాబాద్-చెన్నై బుల్లెట్ ట్రైన్**

హైదరాబాద్: చెన్నై- హైదరాబాద్ వాసుల బుల్లెట్ రైలు కల త్వరలో సాకారం కానుంది. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైలు మార్గం ప్రాజెక్టు తుది అలైన్‌మెంట్ నివేదికను దక్షిణ మధ్య రైల్వే తమిళనాడు ప్రభుత్వానికి సమర్పించింది. ఇది ఇంటర్ సిటీ ప్రయాణంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి చెన్నైకి రైలు ప్రయాణానికి దాదాపు 12 గంటలు పడుతోంది. కొత్త హైస్పీడ్ మార్గం అందుబాటులోకి వస్తే ఈ సమయం గణనీయంగా తగ్గి కేవలం 2.20 గంటలకు చేరుకుంటుంది.తమిళనాడు ప్రభుత్వం కోరిక మేరకు గతంలో గూడూరు మీదుగా ఉన్న ప్రణాళికను మార్చి తిరుపతిలో స్టేషన్‌ను చేర్చారు. తమిళనాడు రాష్ట్ర పరిధిలో మొత్తం రెండు స్టేషన్లు ప్రతిపాదించారు. తమిళనాడులో చెన్నై సెంట్రల్, చెన్నై రింగు రోడ్డు స్టేషన్ ఉంటాయి. అయితే వాణిజ్య, రవాణా సౌలభ్యం కోసం, రైల్వే శాఖ ప్రతి స్టేషన్ చుట్టూ దాదాపు 50 ఎకరాల స్థలాన్ని కోరింది.సమగ్ర ప్రాజెక్టు నివేదికపై ప్రభుత్వ ఆమోదం లభించిన నెలలోపు తుది నిర్ణయం తీసుకుంటామని చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ తెలిపింది. ఈ హైస్పీడ్ నెట్‌వర్క్ నిర్మాణంలో తమిళనాడు పరిధిలో 12 కి.మీ.ల సొరంగ మార్గం ఉండనుంది. ఈ ప్రాజెక్టుకు మొత్తం 223.44 హెక్టార్ల భూమి అవసరం కాగా, ఇందులో అటవీ భూమి లేదని రైల్వే అధికారులు ధృవీకరించారు. ఈ మార్గం దాదాపు 65 రోడ్లు, 21 హైటెన్షన్ విద్యుత్తు లైన్లను దాటాల్సి ఉంటుంది. ప్రభుత్వ కన్సల్టెన్సీ సంస్థ రైట్స్ లిమిటెడ్ నిర్వహించిన సర్వేల ఆధారంగా ఈ అలైన్‌మెంట్ రూపొందించారు.దక్షిణాదిన ప్రణాళికలో ఉన్న రెండు హైస్పీడ్ మార్గాలలో ఇది ఒకటి కాగా, రెండోది హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌గా ఉంది.

ఉత్తేజిత దినపత్రిక



# భారత రాజ్యాంగం కోట్ల మందికి దశ దిశ




## మాల మహానాడు అధ్యక్షులు పబ్బతి శివప్రసాద్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు నవంబర్ 26:**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం కొన్ని కోట్ల మందికి దశ దిశ నిర్దేశించిందని నందికొట్కూరు మండలం శాతనకోట గ్రామంలో 75వ రాజ్యంగా దినోత్సవ సందర్భంగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్. విగ్రహ ఆవిష్కరణ. కార్యక్రమంలో మాలమహానాడు అధ్యక్షులు. పబ్బతి. శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం నందికొట్కూరు మండల పరిధిలోని శాతని కోటలో నూతన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రాజ్యాంగం చాలా గొప్పదని. స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతత్వ%శీ% దాదాపుగా 60 దేశాలలో నేడు స్వేచ్ఛ జీవితం కొనసాగిస్తున్నారని అన్నారు.డా,, అంబేద్కర్అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలనిఅన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మాల మహానాడు ఉపాధ్యక్షులు నల్లమల్ల పుల్లన్న, నందికొట్కూరు మాల మహానాడునాయకులు అరె. రాజు,పట్టణ ఉపాధ్యక్షులు విల్సన్,మాలమహానాడు నాయకులు గోపాల్, మహేంద్ర నందికొట్కూరు మండల.వైస్ ఎంపీపీ పబ్బతి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగం దేశ అభివృద్ధికి మూలస్తంభం

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు నవంబర్ 26:**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించినందుకే నేడు ప్రపంచ దేశాలులలో ప్రజాస్వామ్యం విరజిల్లుతుంది. ప్రతి ఒక్కరు రాజ్యాంగ పలాలు పొందుతున్నామంటే భారత రాజ్యాంగం మూల స్తంభం లాంటిదని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నందికొట్కూరు మున్సిపాలిటీ ఆవరణలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి భారత రాజ్యాంగం దినోత్సవం మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాజ్యాంగం అందించిన ప్రాథమిక హక్కులు, సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను ప్రతి పౌరుడు కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగం దేశ అభివృద్ధికి మూలస్తంభమని, అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ లు పి.చాంద్ భాష,లాలు ప్రసాద్,సప్లయర్ సత్యనారాయణ, మున్సిపల్ మేనేజర్ సుహ్రూలత, డీఈఈ నాసీర్, ఏఈ దినేష్ కుమార్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి రంగస్వామి ఆర్వో మధుసూదన్ బాబు, ఆర్.ఐ మహబూబ్ భాష సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ రణక్షేత్రాలుగా గ్రామాలు !

గ్రామాల్లో మళ్లీ సందడి మొదలయ్యింది. పంచాయతీ ఎన్నికలకు నగారా మోగడంతో రాజకీయ హడావిడి జోరందుకుంది. పార్టీ రహితంగానే ఎన్నికలు జరగనున్నప్పటికీ అధికార, విపక్ష పార్టీలు రాజకీయంగా పట్టు సాధించాలంటే సర్పంచ్ పదవులను గెల్చుకోవాల్సి ఉంటుంది. తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టడం, గెలిపించుకోవడం కోసం గట్టి ప్రయత్నాలు చేయనున్నారు. దీంతో గ్రామాలు ఇప్పుడు రాజకీయ రణక్షేత్రాలు కానున్నాయి. మొత్తంగా పల్లె పోరు మొదలైంది. తాజాగా ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదలైంది. మూడు విడుతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించగా, మంగళవారం సాయంత్రం నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. మూడు దశల్లో నిర్వహించే గ్రామ పంచాయతీల పేర్లను యంత్రాంగం ఖరారు చేసింది. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడంతోపాటు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సన్నద్ధమైంది. కాగా, దాదాపు 20 నెలల తర్వాత ఎన్నికలు జరుగుతున్నాయి. ఇవి పార్టీ రహితమే అయినా, పార్టీలు తమ అభ్యర్థులను గెలిపించుకొని గ్రామాలపై పట్టు సాధించేందుకు ఆయా పార్టీలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. అయితే ఇప్పటికే ఓసారి సర్కారు చేసిన హడావుడిని నమ్మి ఆశావహులు, భారీగా ఖర్చు చేసి షెడ్యూల్ రద్దు కావడంతో నిరాశ చెందారు. ఇప్పుడు మరోసారి షెడ్యూల్ రావడంతో తమ ప్రయత్నాల్లో తలమునకలయ్యారు. కోర్టులో కేసు ఉందని తెలిసినా సర్కారు చేసిన హడావుడిని నమ్మిన ఆశావహులు, ఇప్పటికే తమ ప్రయత్నాల్లో మునిగి తేలారు. ఆ మేరకు భారీగా ఖర్చు చేశారు. నిజానికి ఎన్నికల నిబంధనల ప్రకారం చూస్తే.. సర్పంచ్, వార్డు మెంబర్ల విషయానికొస్తే ఐదు వేలకు పైగా జనాభా ఉంటే అక్కడ సర్పంచ్ బరిలో ఉండే అభ్యర్థి 2.5 లక్షలు, వార్డుమెంబర్ అభ్యర్థి 50వేలు.. అలాగే ఐదు వేల లోపు జనాభా ఉంటే అక్కడ సర్పంచ్ అభ్యర్థి 1.5 లక్షలు, వార్డుమెంబర్ అభ్యర్థి 30వేలలోపు ఖర్చు చేయాలి. అయితే ఆచరణలో జరిగే ఖర్చులకు ఎన్నికల సంఘం పెట్టిన నిబంధనలకు ఎప్పుడూ పొంతన ఉండదన్న విషయం తెలిసిందే. అయితే సాధారణంగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మాత్రమే అభ్యర్థులు ఖర్చుకు మొగ్గుచూపుతారు. కానీ, గతంలోనే షెడ్యూల్ జారీచేయగా, అప్పుడు చాలా మంది అభ్యర్థులు భారీగా ఖర్చు పెట్టారు. తీరా ఆ షెడ్యూల్ రద్దుకావడంతో తీవ్ర నిరాశ చెందారు. ఇక ఇప్పుడు నోటిఫికేషన్ రావడంతో మళ్లీ ఖర్చులకు తెరలేవనున్నది. ఇది లా ఉంటే పల్లెల్లో పట్టు నిరూపించుకోవాలని ప్రధాన పార్టీలు తహతహ లాడుతున్నాయి. పార్టీ రహిత ఎన్నికలే అయినా తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రయత్నాలు అప్పుడే మొదలు పెట్టాయి. ఇకపోతే రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడంతో నామినేషన్ల పర్వం కూడా మొదలయ్యింది. గతంలో ఓ మారు నోటిఫికేషన్ విడుదల, రద్దు కావడంతో అప్పటికే సిద్దంగా ఉన్న అభ్యర్థులు మళ్లీ పోటీకి రంగం సిద్ధం చేసుకున్నారు. ఈసారి సర్పంచ్ ఎన్నికలకు మాత్రమే ఎన్నికలు జరుగనున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు తరవాత నిర్వహించాలని నిర్ణయించడంతో గ్రామ పంచాయతీ ఎన్నికలు మాత్రమే ఎన్నికలు జరుగబోతున్నాయి. మొత్తం మూడు దశల్లో ఎన్నికలు జరుగబోతున్నాయి. మూడు వారాల సమయంలోనే మొత్తం పక్రియ ముగియనుండంతో గ్రామాలు కేంద్రంగా రాజకీయ పార్టీలు బలాబలాలకు రంగం సిద్ధం అయ్యింది. 27తో తొలి దశ ఎన్నికల పక్రియ మొదలై డిసెంబర్ 17తో మూడో దశ పంచాయతీ ఎన్నికలు ముగుస్తాయి. ఒకే రోజు పోలింగ్, ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాల వెల్లడి చేపట్టబోతున్నారు. అదికూడా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాత్రమే పోలింగ్ జరగ నుండడంతో గ్రామాల్లో ఓట్ల వేటలో అభ్యర్థులు పడ్డారు. డిసెంబర్ 11న తొలిదశ, డిసెంబర్ 14న రెండో దశ, డిసెంబర్ 17న మూడో దశ

ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో నామినేషన్ల పర్వం కూడా వెంటనే మొదలయ్యింది. సర్పంచ్ ఎన్నికలకు సమాయత్తం అవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఇక మళ్లీ దావత్‌ల జోరు అందుకోనుంది. ఎన్నికల సంఘం నుంచి ఎన్నికల ప్రకటన ఉంటుందని తెలిసి హడావిడిగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిందని విపక్ష బిఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. మరోవైపు మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు కూడా పంపిణీ చేశారు. కొన్ని చోట్ల రుణాల పంపిణీ సంపూర్ణంగా అందివ్వలేదు. మొత్తానికి చీరల పంపిణీని ప్రభుత్వం పకడ్బందీగా చేపట్టినప్పటికీ క్షేత్ర స్థాయిలో మహిళా లోకం నుంచి స్పందన ఎలా ఉంటుందన్నది చూడాలి. సర్పంచ్ ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తన చేతులో ఉన్న అధికారాన్ని అడ్డంగా వాడుకుంటుండటంపై బిఆర్ఎస్, బిజెపిల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో పోటీ చేయాలనుకొనే ఆశావహులు మద్దతు కూడగట్టు కునేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. తమ వర్గాలు, గ్రూపులను పోగేసుకోవడంతో పాటు తమ ప్రాతినిధ్యాన్ని బలపర్చాలని ముఖ్య కార్యకర్తలు, అనుచరులను కోరుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో కొందరు అభ్యర్థులు తమ భార్యలను రంగంలోకి దింపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి నుంచి ఆయా పార్టీల పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకొని ఎలాగైనా పోటీలో నిలిచేందుకు యత్నిస్తున్నారు. ఓటర్లను కూడా ప్రసన్నం చేసుకొనే పనిలో పడ్డారు.









# ప్రకృతి వ్యవసాయానికి స్ఫూర్తి బాల భాస్కర్ శర్మ

## ప్రభుత్వ ప్రోత్సాహంతో ముందడుగు



**కర్నూలు, నవంబర్ 26: ఉత్తేజిత ప్రతినిధి**

ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రకృతి వ్యవసాయానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు అంబా ఫార్మ్స్ కు చెందిన యు.బాల భాస్కర్ శర్మ .. వృత్తి రీత్యా సాఫ్ట్వేర్ ఇంజినీర్.. అయినా వ్యవసాయం మీద మక్కువతో, తన భూమిలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు కర్నూలు జిల్లా కల్లూరు మండలం నాయకల్లు గ్రామానికి చెందిన యు. బాల భాస్కర్ శర్మ..


బాల భాస్కర్ శర్మ తన 8.5 ఎకరాల పొలంలో ఎలాంటి రసాయనాలను వాడకుండా, పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని చేస్తూ, మామిడి, జామ, సీతాఫలం, బొప్పాయి, అరటి, కొబ్బరి, సపోటా పండ్లతో పాటు అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నారు.. 75 సెంట్లలో పాలీ హౌస్ నిర్వహిస్తున్నారు..ఇందులో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు.. ఇందు కోసం రెండు నెలల క్రితం వీరికి ప్రభుత్వం నుండి రూ.8.5 లక్షల సబ్సిడీ కూడా లభించింది..ప్రకృతి ప్రేమికుడు, వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ స్ఫూర్తితో శర్మ ప్రకృతి వ్యవసాయానికి నాంది పలికారు. ప్రభుత్వ ప్రోత్సాహం కూడా ఇందుకు తోడ్పడడంతో విజయవంతంగా ప్రకృతి వ్యవసాయం అమలు చేస్తున్నారు.. ప్రతి సోమవారం కలెక్టరేట్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్న సందర్భంగా ఎక్కువ మంది అధికారులు, ప్రజలు సందర్శిస్తున్నందున కలెక్టరేట్ లో శర్మ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పండ్లు, కాయ కూరలు, ఆకు కూరల తో ఒక స్టాల్ ను ఏర్పాటు చేయడం జరుగుతోంది..శర్మ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పండ్లను వైజాగ్, విజయవాడ, హైదరాబాద్ నగరాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. కర్నూలు నగరం లో కూడా అంబా ఫార్మ్స్ పేరుతో ఒక ఆర్గానిక్ స్టోర్ ను ఏర్పాటు చేసి అందులో గ్రాసరీస్, పండ్లు తదితరాలను విక్రయిస్తున్నారు. దాదాపు రూ. 45 లక్షల టర్నోవర్తో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాన్ని నిర్వహిస్తూ, పలువురికి స్ఫూర్తిని అందిస్తున్నారు శర్మ..













### తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు

నేను వృత్తి రీత్యా ఐటీ కన్సల్టెంట్ ను.. సుభాష్ పాలేకర్ గారికి ఏకలవ్య శిష్యుడిని.. వారి స్ఫూర్తితో, ప్రభుత్వ ప్రోత్సాహంతో 8.50 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. ఎలాంటి రసాయన ఎరువులు, పురుగుమందులు లేకుండా జీవామృతం, వేప నూనె, పంచగవ్య, దశపర్ణి కషాయం, అగ్ని అస్త్రం, పుల్లటి మజ్జిగ లాంటి పదార్థాలతో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నా.. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు కలిగినది ప్రకృతి వ్యవసాయం..75 సెంట్లలో పాలీ హౌస్ ఏర్పాటు చేశాను..ఇందులో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నా.. ఇందు కోసం రెండు నెలల క్రితం ప్రభుత్వం నుండి రూ.8.5 లక్షల సబ్సిడీ కూడా లభించింది..కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం పండ్లు, ఆకు కూరలు, కూరగాయలు విక్రయించేలా అధికారులు ప్రోత్సహిస్తున్నారు..ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ఉత్పత్తులపై ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు అని శర్మ తన అభిప్రాయాలను పంచుకున్నారు..

### జిల్లాలో ప్రకృతి వ్యవసాయం పెంపుకు చర్యలు తీసుకుంటున్నాం:జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

జిల్లాలో ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రోత్సాహాన్ని ఇస్తోందని, అందువల్ల జిల్లాలో ప్రకృతి వ్యవసాయం పెంపుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.. ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే లాభాలను వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారుల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో 132514 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం అమలు లక్ష్యం కాగా, ప్రస్తుతం 59546 ఎకరాల్లో 42675 మంది రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అమలు చేస్తున్నారన్నారు..నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రకృతి వ్యవసాయం అమలు సాగు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.



ఉత్తేజిత దినపత్రిక

# శ్రీ సాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం

ఉత్తేజిత శ్రీశైలం ప్రతినిధి



నవంబర్ 27వ తేదీన శ్రీశైలం లోక కల్యాణం కోసం దేవస్థానం 26. ఉదయం సాక్షిగణపతిస్వామి వారికి విశేష అభిషేకాన్ని నిర్వహించింది.

కాగా ప్రతి బుధవారం, సంకటహరచవితిరోజులు మరియు పౌర్ణమిరోజులలో శ్రీసాక్షిగణపతి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. సాక్షిగణపతిస్వామివారికి పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి.

వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ గణపతి అభిషేకం వలన అనుకున్న పనులలో ఆటంకాలు తొలగి విజయం లభిస్తుందని చెప్పబడుతోంది. అలాగే కోరిన కోరికలు నెరవేరుతాయని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరిగి విద్య బాగా వస్తుందని చెప్పబడుతోంది. కాగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. భక్తులు శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించినట్లుగా కైలాసంలో పరమేశ్వరుని వద్ద ఈ స్వామి సాక్ష్యం చెబుతాడని ప్రసిద్ధి. అందుకే ఈ స్వామి సాక్షిగణపతిగా పేరొందాడు. చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు.

# ఎమ్మిగనూరులో ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులతో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి




ఎమ్మిగనూరు నవంబర్ 26 బుధవారం బివి ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్య సేవలు, సదుపాయాలు మరియు ప్రభుత్వానికి పంపాల్సిన ప్రతిపాదనలపై చర్చించారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ... ఎమ్మిగనూరు ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది అద్భుతంగా పనిచేస్తున్నారన్నారు. విపక్షాలు ఆస్పత్రిపై దుష్ప్రచారం చేస్తూ వైద్యుల మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఆక్షేపించారు. క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు చేయించేందుకు ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని గుర్తుచేశారు. పీపీపీ ద్వారా ఎమ్మిగనూరు ఏరియా ఆస్పత్రికి అధునాతన వసతులు సమకూరాయని తెలిపారు. పేదలకు ఉచితంగా మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. ఎమ్మిగనూరు ఏరియా ఆస్పత్రికి పీపీపీ పద్ధతిలో సిటీ స్కాన్ వస్తే పేదలకు తక్కువ ధరకే సేవలందుతాయని ఎమ్మెల్యే తెలిపారు. పీపీపీ చార్జీలపై ప్రభుత్వ అజమాయిషీ వల్ల పేదలకు అధునాతన వైద్య పరికరాలతో కూడిన వైద్యం ఉచితంగా లభిస్తుందన్నారు. ఎమ్మిగనూరుకు చిన్నారులకు సంబంధించిన ఎస్ఎన్‌సీయూ మంజూరు కావడం హర్షణీయం అన్నారు. రూ.30 లక్షలతో ఆయూష్ భవనం కూడా కేంద్రం నుంచి మంజూరైందన్నారు. ఎమ్మిగనూరు ఏరియా ఆస్పత్రిని 200 పడకలకు అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు. జనాభా పెరుగుతున్న దృష్ట్యా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వానికి ప్రతిపాదించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యులు, నర్సులు మరియు వైద్య సిబ్బంది, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



# బహుజన సేనా సమితి ఆధ్వర్యంలో %-% 76 వ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారులిలి

కర్నూలు జిల్లా, ఉత్తేజిత ప్రతినిధి ఎమ్మిగనూరు నవంబర్ 26 బుధవారం

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బహుజన సేనా సమితి ఆధ్వర్యంలో ఎమ్మిగనూరులో ఘనమైన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి బహుజన సేనా సమితి రాష్ట్ర అధ్యక్షులు గడ్డం నాగేంద్ర గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజ్యాంగ పరిరక్షణ, సమానత్వం, సామాజిక న్యాయం, మానవ హక్కుల విలువలను ప్రజల్లో విస్తృతంగా చాటిచెప్పడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని అంతే కాకుండా రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, ఆదేశిక సూత్రాలు,శాసనములు తయారు చేయుట న్యాయ వ్యవస్థ ఏర్పాటు మరియు రక్షణ వ్యవస్థను కూడా రాజ్యాంగంలో పొందుపరచడం జరిగింది. ఈ యొక్క రాజ్యాంగాన్ని దేశ ప్రజలు అయినటువంటి మనము గౌరవించి. బీసీ ,ఎస్సీ, ఎస్టీ ,మైనార్టీ, కులాలు రాజ్యాంగ పరిరక్షణలో భాగము అవ్వాలని పిలుపునిచ్చారు. గడ్డం నాగేంద్ర గారు తన ప్రసంగంలో పేర్కొన్నారు. యువత రాజ్యాంగ స్ఫూర్తిని స్వీకరించి సమాజ upliftment లో ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు సంఘం నాయకులు , నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్, మల్లయోధుల మాల మహానాడు, బహుజన సమైక్య సమితి తదితర ప్రముఖ బహుజన సంఘాలు పాల్గొనడం కార్యక్రమానికి విశేష ఆకర్షణగా నిలిచింది. వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు రాజ్యాంగ విలువలపై అవగాహన ప్రసంగాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా:భవిష్యత్తులో కూడా రాజ్యాంగ ఆత్మను ప్రజల్లో సుస్థిరం చేయడానికి మరిన్ని ఉద్యమాత్మక కార్యక్రమాలు చేపడతామని బహుజన సేనా సమితి నాయకత్వం ప్రకటించింది.

# ఖోఖో పోటీలలో సత్తా చాటిన తుగ్గలి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు

విద్యార్థులను అభినందించిన ప్రధానోపాధ్యాయులు ఆగస్టీన్, వ్యాయామ ఉపాధ్యాయులు చందు నాయక్.




తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:

మండల కేంద్రమైన మద్దికేర నందు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి ఉత్సవాల సందర్భంగా మూడు రోజుల కాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో తుగ్గలి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ టోర్నమెంట్ నందు అద్భుత ప్రదర్శనను కనబరిచి నాలుగవ స్థానాన్ని కైవసం చేసుకుని,5000 రూపాయల నగదు బహుమతిని కైవసం చేసుకున్నట్లు తుగ్గలి జడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు చందు నాయక్ తెలియజేశారు. ఈ పోటీలలో ప్రతిభ గారిని బరిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆగస్టీన్, వ్యాయామ ఉపాధ్యాయులు చందు నాయక్,పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు అభినందించారు.




# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026 ( ఎస్ ఐ ఆర్ ) ను త్వరగా చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి / జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

కర్నూలు , నవంబర్ 26 :-జిల్లాలో ఎస్ ఐ ఆర్ 2026 ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఎలక్ట్రోరల్ అధికారి / జిల్లా కలెక్టర్ ఏ.సిరి అధికారులను శిక్షణా కార్యక్రమంలో ఆదేశించారు. బుధవారం సాయంకాలం ఈఆర్వోలు , ఏఈఆర్వోలు , ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దారుల కు చెందిన ఎస్ ఐ ఆర్ - 2026 శిక్షణ కార్యక్రమము ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి / జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ ప్రక్రియలో వెనుకబడి ఉన్నందున అధికారులందరూ బి ఎల్ఓ లు మరియు బిఎల్ ఏ ల సహకారంతో ప్రక్రియను వేగవంతంగా చేయాలని ఆదేశించారు. 2002 లో చివరిసారిగా ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగిందని ఇప్పటికీ 22 సంవత్సరాలు పూర్తి అయినదని కావున కేంద్ర ఎన్నికల సంఘం మరొకసారి ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టడం జరిగిందని తెలిపారు. 2002 ఎలెక్టోరల్ రోల్ ప్రకారం ఇప్పుడు అందుబాటులో ఉన్న ఎలక్ట్రోల్ రోల్ తో ఓటర్లను మ్యాపింగ్ చేసుకోవాలని ఇందుకోసం బిఎల్ఓ ప్రతి ఇంటికి కనీసం మూడుసార్లు వెళ్లి నిర్ణీత ఫారంలలో ఓటర్ వివరాలు సేకరించుకోవాలని ఆ తర్వాతనే డ్రాఫ్ట్ రోల్ లో పేర్లు ఉంచాలని తెలిపారు. మరణించిన ఓటర్ వివరాలు మరియు అందుబాటులో లేని ఓటర్ల వివరాలు నిర్ణీత ఫారాల లో సేకరించుకొని నోటీసులు అందజేసి తొలగించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ , డి ఆర్వో వెంకట నారాయణమ్మ , జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి , కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ , ఈ ఆర్వో లు, ఏఈఆర్వోలు , ఎలక్షన్ డిప్యూటీ తహసిల్దారులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ - ఇంటింటి ప్రచారం:-టిడిపి సోగనూరు

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి



ఎమ్మిగనూరు నవంబర్ 26 బుధవారం నియోజకవర్గ శాసనసభ్యులు గౌ శ్రీ డా బి వి జయనాగేశ్వర రెడ్డి గారి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు సొసైటీ చైర్మన్ దూదేకుల గౌస్ పీర గారి ఆ ధ్ వ ర్ య ం లో ఎ మ్ మ గ న ూ ర ు మండలంలోని సోగనూరు గ్రామంలో ప్రతి రైతును భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం రైతులకు అందించిన సంక్షేమం, ముఖ్యంగా అన్నదాత సుఖీభవ -పిఎం కిసాన్ రెండు విడతలప్రయోజనాల గురంచి వివరంచి, వారి అభిప్రాయాలను తెలుసుకోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేస్తూ లబ్ధిదారులకు కరపత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ సప్పోగు తిమ్మన్న, మనోహర్ లు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

కర్నూలు.ఉత్తేజిత ప్రతినిధి



కర్నూలు బి క్యాంపు, డిగ్రీ కాలేజ్ ఫర్ మెన్ నందు రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

కర్నూలు బి. క్యాంపు నందు గల డిగ్రీ కాలేజీ ఫర్ మెన్ వారు ఏర్పాటు చేసిన రాజ్యాంగ దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి గారు, హాజరయ్యారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవ ప్రత్యేకతను, వరకట్న నిరోధక చట్టాలు గురించి, ఉచిత న్యాయ సేవల గురించి విద్యార్థులకు వివరించారు. సీనియర్ న్యాయవాది వై. జయరాజు మాట్లడుతూ రాజ్యాంగ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తెలిపారు. అనంతరం కాలేజీ నందు రాజ్యాంగ దినోత్సవం మరియు వరకట్న వ్యతిరేక దినోత్సవం పై నిర్వహించిన వ్యాసరచన పోటీల నందు గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు జడ్జి గారి చేతుల మీదగా అందించడం జరిగింది. ఈ సదస్సులో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ జె. హేమంత్ మరియు సత్యనారాయణ, లీగల్ సర్వీసెస్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు,న్యాయవాది రవికుమార్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ త్రినాథ్ కుమార్, ఈగల్ టీమ్ సి. ఐ. సృజన్ కుమార్, మెంబర్ మాసూమ్ వలి, అధ్యాపకులు డాక్టర్ ఫక్రునిషా బేగం, డాక్టర్ వింధ్యవాసినీ దేవి, నాగరాజు విద్యార్థులు పాల్గొన్నారు



# సిఐటియు ఎఐటియుసి ఐఎఫ్టియు కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి




ఎమ్మిగనూరు నవంబర్ 26 బుధవారం మండల కేంద్రంలో సోమప్ప సర్కిల్ నందు కార్మిక సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి ఈ కార్యక్రమానికి సిఐటియు మండల కార్యదర్శి బి రాముడు ఏఐ టియుసి తాలూకా నాయకులు కే తిమ్మ గురుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు ఐఎఫ్టియు జిల్లా నాయకులు పి గోవిందు ఎస్ రాజు మాట్లాడుతూ స్వాతంత్రం రాకముందు భారతదేశంలో కార్మికులు విరోచిత పోరాటాలు ద్వారా 29 రకాల కార్మిక చట్టాలు సాధించుకున్నారని 1920లో కార్మిక సంఘం ఏర్పాటు అయితే 1926లో బ్రిటిష్ ప్రభుత్వం కార్మిక సంఘాల గుర్తింపునిచ్చిందని గుర్తింపు 19 48 లో కనీస వేతనం చట్టం 1965లో బోనస్ చట్టం బోనస 19 61 లో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రసూతి ప్రయోజనాల కల్పించాలని 1972లో గ్రాజువిటీ చెల్లింపుల చట్టం 1970లో కాంట్రాక్టు కార్మికుల రెగ్యులర్ చేయాలని బిల్డింగ్ కార్మికుల సెస్సు చట్టం 1996లో తదితర 29 రకాల చట్టాలు ఉద్యోగులు కార్మికులు నేటి వరకు అందుతున్నాయని తెలిపారు బిజెపి ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా కార్పొరేట్లకు కార్మికులను బానిసలుగా అప్పగించడానికి నాలుగు లేబరు కోడ్లను నవంబర్ 21 నుంచి అమలు చేయాలని భారతదేశంలో చట్ట రూపంలో లేకుండా కార్మిక వర్గాన్ని ఉద్యోగ వర్గాన్ని మోసం చేసే విధంగా బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక ఉద్యోగ వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని కార్మిక సంఘాలు కార్మికులు డిమాండ్ చేశాయి.

# పంచ సూత్రాల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా..!

రైతుల శ్రేయస్సు కోసమే రైతన్న మీకోసం శాతన కోటలో రైతన్న మీకోసం కార్యక్రమం

నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి



నవంబర్ 26 -: రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని వారు పంటలు లాభాలు అర్జించి మంచి ఆదాయాన్ని పొందే దిశగా రైతన్న మీకోసం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య తెలిపారు. బుధవారం నందికొట్కూరు మండల పరిధిలోని శాతనకోట గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్న మీకోసం ఇంటింటి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య కు నందికొట్కూరు వ్యవసాయ సహాయ సంచాలకులు గిరీష్ మరియు వ్యవసాయ అధికారి షేక్షావలి పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ రైతులతో మమేకమై మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మారుతున్న ఆహారాల అలవాటులకు అనుగుణంగా అధిక దిగుబడినిచ్చే పంటలు పండించుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. పంచసూత్రాల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అక్బర్ బాషా, చింతకుంట నారాయణ, షేక్ మహమూద్ ఖాద్రి,లక్ష్మీనారాయణ.,గుట్టపాటి వెంకటరెడ్డి,ఎంపిటిసి గుట్టపాటి. చిన్న సుబ్బయ్య,తిమ్మారెడ్డి, సినిమా డైరెక్టర్ ఆరే వెంకటేశ్వర్లు,ఎం .కృష్ణుడు, లంకల కృష్ణుడు.. గొల్ల.రామకృష్ణ,అగ్రికల్చర్ అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తేజిత దినపత్రిక



# టీటీడీకి రూ.9 కోట్లు విరాళం

**దాతను అభినందించిన టీటీడీ చైర్మన్**

**తిరుమల, ఉత్తేజిత ప్రతినిధి, నవంబర్26.**



అమెరికాకు చెందిన ప్రవాస భారతీయుడు శ్రీ మంతెన రామలింగరాజు తన కుమార్తె శ్రీమతి మంతెన నేత్ర, అల్లుడు శ్రీ వంశీ గాదిరాజుల పేరు మీదుగా తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయాల ఆధునీకరణకు గాను టీటీడీకి బుధవారం రూ.9 కోట్లు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో మీడియా సమావేశం నిర్వహించి దాతను అభినందించారు. శ్రీ మంతెన రామరాజు 2012 లో కూడా టీటీడీకి రూ.16.06 కోట్లు విరాళంగా ఇచ్చారని చెప్పారు. తిరుమలలో భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనలో తన వంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన ఆయనకు చైర్మన్ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో టీటీడీకి మరిన్ని విరాళాలు అందిస్తారని ఆశిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విజయ నగరం ఎంపీ శ్రీ కలిశెట్టి అప్పల నాయుడు, టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగం మన దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతీక.

**ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య.**

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, నవంబర్26.**



మన భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతీక అని, రాజ్యాంగం నిబంధలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని తిరుపతి జిల్లా ఇంచార్జి జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. 76వ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలను బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ 1949 నవంబర్ 26న మన రాజ్యాంగాన్ని ఆమోదించినందుకు గుర్తుగా ప్రతి సంవత్సరం నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు. భారత రాజ్యాంగం మనకు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అందిస్తోందని తెలిపారు. అటువంటి రాజ్యాంగాన్ని గౌరవించడం, విలువలను కాపాడడం మన బాధ్యత అన్నారు. ప్రజాస్వామ్య దేశంగా లౌకిక రాజ్యంగా మనదేశం కీర్తించబడడానికి దృడమైన మన రాజ్యాంగమేనని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని అమలు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ఏసీపీ మూర్తి, మధు, మేనేజర్ హాసిమ్, డి.ఈ. లు మహేష్, లలిత, మధు, వెంకట ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక,రైతాంగ వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలి

**ఐ. ఎఫ్.టి.యు జిల్లా నాయకులు ఎస్.బాలరాజు,ఏఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి ఎం.సత్యన్న**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**
**ఎమ్మిగనూరు నవంబర్ 26**





బుధవారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక రైతాంగ వ్యతిరేక చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఐఎఫ్.టీయూ జిల్లా నాయకులు ఎస్.బాలరాజు, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి ఎం.సత్యన్న డిమాండ్ చేశారు. బుధవారంనాడు రాష్ట్ర కార్మిక రైతు సంఘాల ఐక్య కార్యాచరణ సంఘాల పిలుపుమేరకు స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలోని సోమప్ప సర్కిల్ నందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ బాలరాజు, కామ్రేడ్స్ సత్యన్న మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదను దోచిపెడుతున్నారని అన్నారు. నేటి వరకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంట నష్టపరిహారం రాష్ట్రాలకు అందలేదని తెలిపారు. పంటకు కనీస మద్దతు ధర ప్రకటించ పోవడంతో రైతంగం తీవ్రంగా నష్టపోయారని అన్నారు. రాష్ట్రంలోని ప్రధానమైన వరి, పత్తి ,జొన్న మొక్కజొన్న, టమోటా ,మిరప పండించిన పంటలు అధిక వర్షాల వల్ల పూర్తిగా దెబ్బ తిన్నాయని తెలిపారు. తక్షణ సహాయం అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం వలన రాష్ట్రంలోని రైతాంగం అప్పుల్లో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను నాలుగు లేబర్ కోడులుగా విభజించడం వలన కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని అన్నారు. కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం పెంచి 12 గంటలు చేయడం వలన కార్మికులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందని వ్యక్తం చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, ఉపాధి కల్పన సరైన స్పష్టత ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం వారి జీవితాలతో చెలగాటమాడుతుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు తలవంచడం సరైనది కాదని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణ చేస్తూ, కార్పొరేట్ల సేవలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఊడిగం చేస్తున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ దేశ ప్రజల ఆకాంక్షను ప్రజల్లో ముందుకు తీసుకుపోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని, తక్షణమే కార్మిక రైతాంగ వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు,మల్లికార్జున ,నరసింహులు,రాముడు ,ఎల్లప్ప,జయరాజ్, నాగార్జున,మరెప్ప, ఎస్.రాజు,ఏసన్న ,గిరిలింగన్న,రాజు,వీరంజినేయులు, సంజన్న,వెంకటేష్,బాబు, ఉరుకుందు గౌడ్,తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి పశు వైద్య విశ్వ విద్యాలయం

**డెయిరీ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ పాల దినోత్సవ వేడుకలు...**

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,నవంబరు 26::**



భారత దేశ పాల మనిషిగా ప్రసిద్ధి చెందిన డాక్టర్ వర్గీస్ కురియన్ జన్మదినాన్ని పురస్కరించుకుని, ఇండియన్ డైరీ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ (ఐ డి ఏ- ఏపీ ) స్థానిక చాప్టర్ మరియు కాలేజ్ ఆఫ్ డైరీ టెక్నాలజీ, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం, తిరుపతి సంయుక్తంగా తిరుపతి లోని కాలేజ్ ఆఫ్ డైరీ టెక్నాలజీలో బుధవారం జాతీయ పాల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ వర్గీస్ కురియన్ చిత్రపటానికిఐడిఎ, సిడిటి అధికారులు డాక్టర్ కురియన్ చిత్రపటానికిపుష్ప మాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భారతదేశంలో పాడి పరిశ్రమ అభివృద్ధిలో మరియు గ్రామీణ పాల ఉత్పత్తిదారుల సాధికారతలో, ముఖ్యంగా మహిళల సాధికారతలో డాక్టర్ వర్గీస్ కురియన్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో, చిత్తూరు జిల్లా కుప్పం మండలం గరిగచ్చినీపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ నాగజ్యోతిని ఐడిఎ-ఎపి లోకల్ చాప్టర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ - 2025 లో ఉత్తమ మహిళా పాడి రైతుగా గుర్తించి ఎంపికైన శ్రీమతి చంద్రశేఖర్ నాగజ్యోతిని సత్కరించారు. మరియు ఈ సందర్భంగా ఆమెకు రూ.10000/- నగదు బహుమతి, సర్టిఫికెటు కూడా అందజేశారు. ఈ సందర్భంగా, తిరుపతి లోని ఆరు వేర్వేరు కళాశాలలైన ఎస్.వి. అగ్రికల్చర్ కాలేజ్, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ కాలేజ్ ఆఫ్ డైరీ టెక్నాలజీ, ఎస్.వి. ఆర్ట్స్ కాలేజ్, డిపార్ట్మెంట్ ఆఫ్ హోమ్ సైన్స్, ఎస్వీ యూనివర్సిటీ మరియు డిపార్ట్మెంట్ ఆఫ్ హోమ్ సైన్స్, ఎస్పీ ఉమెన్ యూనివర్సిటీ విద్యార్థులకు “పాల ఉత్పత్తిదారులకు మెరుగైన రాబడిని నిర్ధారించడం” అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు . మొదటి ముగ్గురు విజేత విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. తిరుపతి పశు వైద్య విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ జె.వి. రమణ, ఐ డి ఏ- ఏపీ స్థానిక చాప్టర్ చైర్మన్ డాక్టర్ రవి కుమార్, డైరీ సైన్స్ ఫ్యాకల్టీ డీన్, ఐ డి ఏ- ఏపీ స్థానిక చాప్టర్ కార్యదర్శి డాక్టర్ కె. నాగేశ్వరరావు, అసోసియేట్ డీన్ డాక్టర్ గంగరాజు, డాక్టర్ మంజునాథ తిరుపతిలోని కాలేజ్ ఆఫ్ డెయిరీ టెక్నాలజీ బోధన బోధనేతర సిబ్బంది .

# 76వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలలో పాల్గొన్న జై భీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిది**



ఎమ్మిగనూరు నవంబర్ 26 బుధవారం నియోజకవర్గ ఎమ్మిగనూరు టౌన్ యందు76 వ భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు టౌన్ యందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి కూడలియందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి జై భీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య గారు పూలమాల వేయడం జరిగింది అనంతరం జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ 76 వా భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నాయకులు కార్యకర్తలతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ భారత రాజ్యాంగం రూపకల్పము చేసి భారతదేశానికి అందించడంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు ఎంతో కష్టపడి ఎస్సీ బీసీ ఎస్టీ మైనార్టీలకు భారత్ యావత్ జన సమూహముకు ఆరాధ సమాన దేవుడుగా నిలిచారు ఈరోజు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు భారత రాజ్యాంగం రచించకపోయి ఉంటే భారతదేశం లో బీసీ ఎస్టీ ఎస్సీ మైనార్టీ కులాలకు మనుగడ లేకుండా చేసేవారని ఆయన అన్నారు అదేవిధంగా ఇప్పుడు కొంతమంది మనువాదులు భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు పడుతున్నారు భారత రాజ్యాంగానికి జోలికి వస్తే జై భీమ్ ఎమ్మార్పీఎస్ సహించబోదని కఠినంగా చెప్పారు ఈరోజు భారత రాజ్యాంగ పరంగానే భారత దేశంలో అన్ని గవర్నమెంట్ ఆఫీసులు భారత పరిపాలన వ్యవస్థ నడుచుకుంటుందని ఇదంతా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పెట్టిన భిక్షాన్ని ఆయన మాట్లాడారు అదేవిధంగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల మాట్లాడుతూ భారత రాజ్యాంగం మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు ఒక బీసీల ఎస్టీల ఎస్టీల మైనార్టీల ఒక్కరి కోసమే భారత రాజ్యాంగం రచించలేదని యావత్ భారత దేశ ప్రజల కోసం వాళ్ళ మాన, కుల ధన, రక్షణ వ్యవస్థ కోసమే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు జీవితమంతా ధారపోశారని ఆయన అన్నారు. కొంతమంది మనోవాదులు భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర పడుతున్నారు అలాంటి వారికి పుట్టగతులు ఉండవని ఆయన మాట్లాడారు అదేవిధంగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షులు శవాల బుజ్జి బాబు మాదిగ మాట్లాడుతూ ఈరోజు ఈ ఎమ్మిగనూరు టౌన్ నడిరోడ్డుపై ఇంత సగర్వంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు రచించిన భారత రాజ్యాంగం దినోత్సవం జరుపుకుంటున్నామంటే ఆయన దయ ఆయన కరణ అని మాట్లాడారు ఈ ఎమ్మిగనూరు పట్టణంలో 76వ భారత రాజ్యాంగ దినోత్సవం ప్రతిజ్ఞ చేసి వినోత్నకంగా జరుపుకోవాలని ఒక్క జై భీమ్ ఎమ్మార్పీఎస్ సంఘానికి మాత్రమే దక్కుతుందని ఆయన మాట్లాడారు అంబేద్కర్ ఆశయాలు సాధించాలంటే పూటకో మాట మాట్లాడుతూ పబ్బం గడుపుకోవడం కాదు అంబేద్కర్ ఆశయాలు అంటే ఒక చిత్రపటానికో ఒక విగ్రహం కో పూలమాలవేసి చేతులు దులుపుకోవడం కాదని అంబేద్కర్ ఆశయాలను ఆయన సిద్ధాంతాలను మన గుండెలో పెట్టుకొని ప్రతి ఇంట్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి చిత్రపటం పెట్టుకుని పూజించాలని అన్నారు ఈ కార్యక్రమానికి జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సలహాదారులు ఆంజనేయులు మాదిగ, జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆదోని డివిజన్ అధ్యక్షులు సందెపు ఎర్రన్న మాదిగ, జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు మండల అధ్యక్షులు నాయకంటి ఆదాము మాదిగ,జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు టౌన్ ఇన్చార్జి కదిరి కోట రాజ్ కుమార్ మాదిగ జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు టౌన్ ప్రధాన కార్యదర్శి సందె పోగు హనుమంతు మాదిగ జై భీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు గురజాల జాన్ మాదిగ, జై భీమ్ ఎమ్మార్పీఎస్ పోలీస్ చింత గ్రామ అధ్యక్షులు పోతురాజు భాస్కర్ మాదిగ, జై భీమ్ ఎమ్మార్పీఎస్ గోనిగండ్ల మండల నాయకులు సిద్ధి పోగుల గిరి మాదిగ జై భీమ్ ఎమ్మార్పీఎస్ మేక డోనా నాయకులు అయ్యప్ప మాదిగ తదితరులు పాల్గొన్నారు

# చనిపోయిన కార్మిక కుటుంబ సభ్యులకు ఉద్యోగాలంటూ అబద్ధాల మాటలతో మభ్యపెడుతున్న మున్సిపల్ కమిషనర్

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు నవంబర్ 26 బుధవారం 10వ రోజు దీక్షల సందర్భంగా చనిపోయిన కుటుంబ సభ్యులకు అవుట్సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించాలని కౌన్సిల్ సభ్యులకు వినతి పత్రాలు ఇచ్చే ప్రయత్నంలో పోలీసుల తోపులాట తక్షణమే నియోజకవర్గ శాసనసభ్యులు బి.వి.జయ నాగేశ్వర రెడ్డి కలగజేసుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి: ఏఐటీయూసీ,ఐఎఫ్టియు ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో పనిచేస్తూ మరణించిన 13 మంది పారిశుధ్య కార్మిక కుటుంబ సభ్యులకు ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించే విషయంలో మున్సిపల్ కమిషనర్ అబద్దాలతో బాధిత కుటుంబాలను మోసం చేస్తున్నారని సిపిఐ పట్టణ కార్యదర్శి జి. రంగన్న, సిపిఐ (ఎంఎల్ న్యూ డెమోక్రసీ) నాయకులు రాజు తెలిపారు. బుధవారం 10,వ రోజు నిరాహార దీక్షల సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు తక్షణమే ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించాలని, కౌన్సిల్ జరుగుతున్న సందర్భంగా కౌన్సిల్ గౌరవ కౌన్సిల్ సభ్యులకు వినతి పత్రాలు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తే పోలీస్ అధికారులు అడ్డుకోవడంతో తోపులాట జరిగిందని, ఈ కౌన్సిల్ సమావేశాన్ని కూడా అబద్దాలతో మున్సిపల్ కమిషనర్ పక్కదోవ పట్టించడం బాధాకరమని వారు తెలిపారు. సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గా మూడేళ్ల పాటు గంగిరెడ్డి గారు ఉన్నారని, ప్రస్తుత టిడిపి ప్రభుత్వంలో రెండేళ్లు తానే మున్సిపల్ కమిషనర్ ఉన్నారని, మొత్తం ఐదేళ్లపాటు మున్సిపల్ కమిషనర్ గా ఉన్న సందర్భంలో బాధిత కుటుంబ సభ్యులకు ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేదని వారు మున్సిపల్ కమిషనర్ ప్రశ్నించారు. ఇప్పటికే బాధిత కుటుంబాలకు ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆమోదించి సంతకం చేసి పంపిన ఇప్పటివరకు ఎవర్ని విధుల్లోకి తీసుకోలేదని వారు తెలిపారు. కాబట్టి తక్షణమే శాసనసభ్యులు బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి జోక్యం చేసుకుని తక్షణమే బాధిత కుటుంబ సభ్యులకు ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించాలని వారి విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మ గురుడు, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ చనిపోయిన కుటుంబ సభ్యులకు మానవ దృక్పథంతో వారి కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించే విషయంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి గారు రాజకీయాలు చేస్తున్నారని పలుమార్లు ఆయన దృష్టికి తీసుకెళ్లిన అబద్ధాలతో 10 రోజులు,20 రోజులు నెల,రెండు నెలలు, అంటూ మాటలతో కాలయాపం చేస్తూ బాధిత కుటుంబ సభ్యులను రోడ్డుపాలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 10,వరోజు నిరాహార దీక్షలకు ఏపీయూడబ్ల్యూజే విలేకరులు సంఘం నాయకులు పాల్గొని సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ మాట్లాడిన ఏపీయూడబ్ల్యూజే నాయకులు శ్రీనివాసులు నాయుడు,పరమేష్ గారికి దీక్షల సందర్భంగా ,ఏఐటియుసి ఐఎఫ్టియు కార్మిక సంఘాల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక నాయకులు ఎల్లప్ప, శివకృష్ణ,రాజు, భీమన్న గౌడ్,ప్రతాప్,ఈరన్న, ఉరుకుందు,యోహాన, తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్ ఆధారిత పంటలు రైతులు సాగు చేయాలి



**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

పత్తికొండ నవంబర్ 26 బుధవారం మండలంలో జూటూరు నలకదొడ్డి, దేవనబండ ,చిన్న హుల్తి ,హొసూరు గ్రామాల లో జరుగుతున్న రైతన్న మీకోసం కార్యక్రమాన్ని పరిశీలించడం జరిగింది అన్ని గ్రామాలలో ఉన్న రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతు కుటుంబాలను కలిసి ప్రభుత్వం అందించే పథకాలపై మరియు గౌరవ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ఐదు అంశాలను ప్రజలకి తెలియజేయడం జరిగింది నీటి లభ్యత డిమాండ్ ఆధారిత పంటలు వ్యవసాయానికి టెక్నాలజీ అనుసంధానించడం ఫుడ్ ప్రాసెసింగ్ ప్రభుత్వాన్ని నుంచి మంచి మద్దతు వంటి వాటితో పాటు పశువులు మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం వంటి వాటిపై రైతులకు తెలియజేయడం జరిగింది రైతులందరూ సాగు చేసే పంటలను ఏక పంటగా కాకుండా మిశ్రమ పంటలను సాగు చేయాలని రైతులకు వివరించడం జరిగింది. పెట్టుబడి సాయం లేకుండా ప్రకృతి వ్యవసాయాన్ని పాటించాలని సూచించడం జరిగింది. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు అధిక ప్రాధాన్యతతో కూడిన అవకాశాలు ఉన్నాయి కావున రైతులందరూ ప్రకృతి వ్యవసాయాన్ని అందరూ పాటించాలని తెలియజేయడం జరిగింది అలాగే రైతులు డ్రిప్పు స్ప్రిన్కర్లు వంటివి వాడటం వల్ల నీటిని వృధా చేయకుండా పంటలను సాగు చేయవచ్చును దీనిపై పండ్లతోటలకు మరియు కూరగాయల పంటలకి వ్యవసాయ పంటలకి నీటి కొరత లేకుండా పంటలు సాగు చేసుకోవచ్చు కావున దీనిపై రైతులు బోరు వేసుకున్న మరియు కాలువకుల ద్వారా చెరువుల ద్వారా నీటిని ఉపయోగించుకుని రైతులు నీటి వాడటం వృధా కాకుండా చేసుకోవచ్చును గత సంవత్సరం ఖరీఫ్ మరియు రబీ కాలంలో పండించిన పంటలపై రైతులు పెట్టుబడి ఖర్చులు ఎక్కువగా పెట్టడం వలన దిగుబడులు మరియు ఆర్థికంగా చాలా సాగు చేసే పంటలపై ఖర్చు పెట్టడం జరిగింది 2026 27 సంవత్సరం కాలానికి కూడా సాగు చేసే పంటలను రైతులు మిశ్రమ పంటలుగా సాగు చేయాలని తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు రైతు సేవ కేంద్రం సిబ్బంది గ్రామంలోని రైతులు పాల్గొన్నారు %గూ%వెంకటరాముడుమండల వ్యవసాయ అధికారి పత్తికొండ

# కడుపు ఇన్ఫెక్షన్ ఉన్నవారు ఇవి తింటే..

కొందరికి తీసుకున్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవడం, గ్యాస్ట్రిక్ సమస్యలు, వికారం, వాంతులు వంటి సమస్యలు ఇబ్బంది పెడుతుంటాయి. ఇవి కడుపులో ఇన్ఫెక్షన్ కారణంగా కావచ్చు. దీన్ని స్టమక్ బగ్ అని కూడా పిలుస్తుంటారు. ఇది జీర్ణవ్యవస్థకు వాపు కలిగించే ఒక ఇన్ఫెక్షన్. ఇది సాధారణంగా.. నోరోవైరస్, రోటవైరస్ కారణంగా వస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ కారణంగా.. వికారం, వాంతులు, అతిసారం, జ్వరం, పొత్తికడుపు నొప్పి వంటి సమస్యలు ఎదురవుతాయి. ఆరోగ్యకరమైన ఆహారంతో.. కడుపులో ఇన్ఫెక్షన్‌ను నయం చేయలేనప్పటికీ.. దీని లక్షణాలను తగ్గించడానికి కొన్ని ఫుడ్స్ సహాయపడతాయి, ఇవి సమస్య నుంచి త్వరగా కోలుకోవడానికి మద్దతు ఇస్తాయి. విరేచనాలు, వాంతులు డీహైడ్రేషన్‌కు దారితీస్తాయి. అందుకే కడుపులో ఇన్ఫెక్షన్ కారణంగా బాధపడేవారు.. సరిపడా నీళ్లు తాగడం చాలా ముఖ్యం. కడుపులో ఇన్ఫెక్షన్ కారణంగా బాధపడేవారు ఎలాంటి ఫుడ్ తీసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం.









అల్లం.. అల్లంలో శక్తివంతమైన యాంటీఇన్ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి కడుపు లైనింగ్‌కు ఉపశమనం ఇస్తాయి. అల్లం వికారం నుంచి ఉపశమనం ఇవ్వడానికి సహాయపడుతుంది. కడుపు ఇన్ఫెక్షన్ నుంచి.. ఇబ్బంది పడేవారు, అల్లం టీ తీసుకుంటే కడుపు ఇన్ఫెక్షన్ లక్షణాల నుంచి ఉపశమనం ఇస్తుంది. వారి డైట్‌లోనూ అల్లం చేర్చుకుంటే మంచిదని నిపుణులు అంటున్నారు.

అరటిపండ్లు.. అరటిపండ్లు.. సులభంగా జీర్ణమవుతుంది. అరటిపండ్లలోని ఫ్యాట్స్, పిండిపదార్థాలు, ప్రోటీన్, ఫైబర్, పొటాషియం, ఫాస్ఫరస్, పెప్టిన్, సుక్రోజ్, ఫ్రక్టోజ్, గ్లూకోజ్, విటమిన్-సి, విటమిన్-బి6 వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అరటిపండ్లలోని ఫైబర్ పేగు కదలికలను మెరుగుపరుస్తుంది. ఇది జీర్ణక్రీయకు మేలు చేస్తుంది. కడుపు ఇన్ఫెక్షన్లతో బాధపడేవారు.. పండిన అరటిపండ్లు, అరటిపండు స్మూతీ తీసుకోవాలని నిపుణులు అంటున్నారు.


టోస్ట్.. నార్మల్ టోస్ట్ కడుపులోని అధిక యాసిడ్‌ను గ్రహిస్తుంది. ఇది కడుపు ఇన్ఫెక్షన్ నుంచి ఉపశమనం అందిస్తుంది. మీ డైట్‌లో హోల్‌గ్రేయిన్, గ్లూటెన్ ఫ్రీ టోస్ట్ తీసుకోండి.

పెరుగు.. పెరుగులో ప్రోబయోటిక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మీ గట్‌లోని ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాను సమతుల్యను పునరుద్ధరిస్తాయి. కడుపులో ఇన్ఫెక్షన్ కారణంగా ఇబ్బందిపడేవారు వారి డైట్‌లో పెరుగు తీసుకోవాలని నిపుణులు అంటున్నారు.









అన్నం.. తెల్ల అన్నం కడుపుకు సున్నితంగా ఉంటుంది, సులభంగా జీర్ణమవుతుంది. దీనిలో కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శక్తి స్థాయిలను తిరిగి నింపడానికి సహాయపడతాయి.

చికెన్, కూరగాయలు సూప్.. కడుపు ఇన్ఫెక్షన్ కారణంగా ఇబ్బంది పడేవారు.. చికెన్, కూరగాయలు సూప్ తీసుకుంటే..కడుపుకు సున్నితంగా ఉంటుంది, శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడానికి సహాయపడతాయి. వీటిలో విటమిన్లు, మినరల్స్ కూడా అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియకు కూడా మేలు చేస్తుంది.,

లీన్ ప్రోటీన్.. ఉడికించిన చికెన్, చేపలు, టోఫు వంటి లీన్ ప్రొటీన్ మూలాలను తీసుకోవడం వల్ల కండరాల కణజాలాన్ని బాగు చేయడాని, నిర్వహించడానికి తోడ్పడతాయి. ఎక్కువ మసాలాలు లేకుండా.. మైల్డ్‌గా తీసుకోండి.

చామంతి టీ.. చమోమిలే టీలో ఓదార్పు గుణాలు ఉన్నాయి, ఇది కడుపు నొప్పి నుంచి ఉపశమనం ఇవ్వడానికి.. తోడ్పడతాయి. ఇది జీర్ణక్రియకు కూడా సహాయపడుతుంది. ఇది ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తుంది. కడుపు ఇన్ఫెక్షన్లతో బాధపడేవారు.. చామంతి టీ తీసుకోవాలని నిపుణులు అంటున్నారు.

# ఆవనూనె ఇలా వాడితే

## గుండె, కీళ్ళ సమస్యలు దూరం..



చలికాలం వచ్చిందంటే మనం ప్రతి విషయాల్లోనూ మార్పులు చేయాలి. అలాంటి వాటిలో నూనె కూడా మార్చాలి. అందుకోసం ఆవ నూనె వాడడం మంచిది.

ఆవాల నూనెతో ఉపయోగాలు

ఆవాల నూనెతో ఉపయోగాలు

చలికాలంలో ఉదయం ఎక్కువగా చలి ఉంటుంది. ఇది బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్స్ ఎక్కువగా స్ప్రెడ్ అవుతుంటాయి. ఇలాంటప్పుడు అనేక సమస్యలు వస్తాయి. వీటిని తగ్గించేందుకు మెడిసిన్ వాడతాం. అయితే, సమస్య వచ్చాక బాధపడే బదులు రాకముందే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మంచిది కదా. అందులో భాగంగా ఆవనూనె చాలా హెల్ప్ చేస్తుంది. దీనిని వాడితే అనేక సమస్యల నుండి మనల్ని మనం కాపాడుకోవచ్చు.ఆయుర్వేదంలో ఆవనూనెలో ఎక్కువగా ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి మన బాడీకి విటమిన్ ఇ, మినరల్స్‌తో పాటు పోషకాలను అందిస్తాయి. చలికాలంలో ఆవనూనె తీసుకోవడం చాలా మంచిది. దీని వల్ల చాలా లాభాలు ఉన్నాయి.

గుండె ఆరోగ్యానికి.. ఆవాల నూనెలో ఒమేగా 3, ఒమేగా 6 మూలకాలు ఉన్నాయి. ఇవి శరీరంలో రక్త ప్రసరణ సులభతరం చేస్తాయి. రక్తపోటుని కంట్రోల్ చేయడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని పెంచుతుంది. కాబట్టి, చలికాలంలో వంటల్లో ఆవ నూనె వాడడం వల్ల గుండె సమస్యలు దూరమవుతాయి.

జలుబు, దగ్గు.. జలుబు, దగ్గు సమస్యలతో బాధపడేవారు ఆవ నూనె వాడడం వల్ల రిలీఫ్‌గా ఉంటుంది. ఇందుకోసం కొద్దిగా ఛాతీపై ఆవ నూనె వేసి రుద్దాలి. దీని వల్ల ఛాతీలో పేరుకుపోయిన కఫం తగ్గిపోతుంది. దీని వల్ల బాడీలోని అదనపు నీరు కూడా తగ్గిపోతుంది. చాలా మందికి జలుబు ఎక్కువై శ్వాస తీసుకోవడం కూడా ఇబ్బందిగా ఉంటుంది. అలాంటివారు ఆవ నూనె రాస్తే సమస్య తగ్గిపోతుంది.అదే విధంగా వేడి నీటిలో కొద్దిగా ఆవ నూనె వేసి ఆవిరిపట్టినా ప్రయోజనం ఉంటుంది.

కీళ్ళనొప్పులు.. కలికాలంలో కాళ్ళు, చేతుల నొప్పులు ఉంటాయి. అందుకోసం ఆవ నూనెని చేసి వంట చేస్తే ఎముకల సంబంధిత సమస్యల దూరమవుతాయి. దీనికోసం వెల్లుల్లిని ఆవా నూనెలో వేసి మరిగించి నొప్పి ఉన్న చోట మసాజ్ కూడా చేయొచ్చు.

ఆర్థరైటిస్.. చలికాలంలో ఎముకల సమస్యలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, గోరువెచ్చని ఆవ నూనెని మసాజ్ చేస్తే రక్త ప్రసరణ పెరిగి కీళ్ళనొప్పులు, తీవ్రంగా ఉండే నొప్పులు దూరమవుతాయి.

నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

# ఇంట్లోనే పెడిక్యూర్ చేసుకోండిలా..!

బ్యూటీ పార్లర్‌లో పెడిక్యూర్ కోసం వందల రూపాయలు ఖర్చు చేస్తూ ఉంటారు. ఇంట్లోనే కొన్ని సహజ పదార్థాలతో మీ పాదాలను మెరిపించేయండి.

అందంగా ఉండాలని ఎవరికుండదు? అందంగా కనిపించడానికి ప్రయత్నం చేయని వారుండరు. ఈ రోజుల్లో.. జుట్టు నుంచి పాదాల వరకూ ప్రతి ఒక్కటీ అందంగా ఉండాలి అని కోరుకునే అమ్మాయిలే ఎక్కువ. అందం కోసం ఎంత ఖర్చైనా పెడుతున్నారు. మృదువైన, అందమైన కాళ్ల కోసం.. పార్లర్‌లో పెడిక్యూర్ చేయించుకుంటూ ఉంటారు. కొన్ని సార్లు పాదాలకీ అంత ఖర్చెందుకు అనిపిస్తుంది. ఇంట్లోనే కూర్చుని సహజ పదార్థాలతో మీ పాదాలను అందంగా, మృదువుగా మార్చుకోవచ్చు. అది ఎలానో ఈ స్టోరీలో చూద్దాం.



ముందుగా కాలి గోళ్ల పెయింట్‌ను తొలగించండి. తరువాత గోళ్లను అనుకున్న రీతిలో కట్ చేసుకోండి. ఆ తరువాత ఒక టబ్‌లో గోరువెచ్చని నీళ్ల తీసుకుని దానిలో చిటికెడు ఉప్పు, సుగంధ నూనే, నిమ్మరసం షాంపు వేసి 30 నిమిషాల పాటు పాదాలను నానబెట్టండి. ఉప్పును చేర్చటం వల్ల పాదాల్లోని దుమ్మును దూరం చేసి చర్మాన్ని మృదువుగా చేస్తుంది. మంచి ప్యూమిస్‌స్టోన్‌తో మురికి వదిలేంత వరకూ స్క్రబ్ చేయాలి. లేదా గరుకుగా ఉండే పిండితో మడమలు అరికాళ్లు శుభ్రంగా రుద్దాలి. పాదాల చుట్టూ పేరుకున్న మృతకణాలు, తెల్లనిపొర తొలగిపోయి మృదువుగా మారతాయి.

ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన తరువాత మర్దనా ఆయిల్ లేదా మాయిశ్చరైజర్‌తో పాదాలను మొదట సుతిమెత్తంగా, తరువాత కాస్త గట్టిగా మసాజ్ చేసుకోండి.

ఇప్పుడు స్క్రబ్ చేసుకోవడానికి రెండు స్పూన్ల కొబ్బరి నూనె, నాలుగు చెంచాల చక్కెర, స్పూన్ చొప్పున నిమ్మరసం, తేనెలను ఒక గిన్నెలో వేసి బాగా మిక్స్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని వేళ్లు, అరికాళ్లకు మసాజ్ చేసి, ఆపై నీటితో కడిగేసుకోవాలి. ఆ తర్వాత మాయిశ్చరైజర్ అప్లై చేసుకోండి.

వారానికి రెండు సార్లు ఇలా..

పాదాలను మెరిపించడంలో అరటితొక్కలు చక్కగా పనిచేస్తాయి. అరటితొక్కలను పాదాలపైన రుద్దితే మృతకణాలు, దుమ్ము ధూళీ తొలగిపోతాయి. అరటి తొక్కలను ముక్కలుగా తరిగి కొద్దిగా తేనె వేసి పేస్టు చేయాలి. ఈ పేస్టుని పాదాలకు రాయాలి. అరగంట తరువాత సాధారణ నీటితో కడిగేయాలి. ఇలా వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల పాదాలు మృదువుగా మారడంతో పాటు, చక్కగా మెరుస్తాయి.

గమనిక: ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

# శీతాకాలంలో మీ పిల్లల కళ్లను రక్షించడానికి..





శీతాకాలంలో పిల్లల కళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. ఎందుకంటే.. కఠినమైన వాతావరణం వారి కళ్ల పై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అలెర్జీలు, కంటి వాపు, పొడిబారడం, కళ్ల నుంచి నీరు రావడం, కండ్లకలక వంటి సాధారణ వైరల్ ఇన్‌ఫెక్షన్లు.. ఎక్కువగా ఎటాక్ చేస్తుంటాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ఈ సీజన్‌లో మీ పిల్ల కంటి ఆరోగ్యంపై మరింత కేర్ తీసుకుంటే మంచిది. కోయంబత్తూర్‌లోని శంకర ఐ హాస్పిటల్‌లోని పీడియాట్రిక్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ రాజేష్ ప్రభు.. చలికాలంలో చిన్నారుల కంటి సంరక్షణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో మనకు వివరించారు.

రెప్పలు వేయమని గుర్తుచేయండి..


సాధారణంగా కొన్ని సెకన్లకోసారి కళ్లు ఆర్పుతాం. దీని ద్వారా కళ్లకు అలసట తగ్గడమే కాదు.. పొడిబారకుండానూ ఉంటాయి. ఈ డిజిటల్ జనరేషన్‌లో పిల్లలు ఫోన్లకు బాగా ఎడిక్ట్ అయ్యారు. గ్యాడ్జెట్లను చూసేప్పుడు కన్నులు ఆర్పడం మర్చిపోతూ ఉంటారు. దీంతో కళ్ల మంటలు, నీరు కారడం, తలనొప్పి వంటి సమస్యలు వస్తాయి. కనురెప్పలు వేయమని వారికి, తరుచు గుర్తుచేయండి. అంతేకాదు, ఓ నిమిషం పాటు అదేపనిగా కనురెప్పలు మూయడం, తెరవడం చేయమనండి. అలాగే రోజులో గుర్తుంచుకొని మరీ ఇలా కొన్ని సెకన్లు చేయమనండి. కంటిచూపు సమస్యలు రాకపోవడమే కాదు, ఏకాగ్రతా పెరుగుతుంది.

సరిపడా నీరు తాగిపించండి..

సరిపడా నీళ్లు, ద్రవ పదార్థాలు తీసుకుంటే.. శరీరం హైడ్రేట్‌గా ఉంటుంది. సరిపడా నీళ్లు శరీరాన్ని క్లీన్ చేస్తుంది, టాక్సిన్స్‌ను తొలగిస్తుంది. అంతేకాకుండా.. కంటి ఒతత్తిడిని తగ్గిస్తతుంది. మీ చిన్నారి హైడ్రేట్‌గా ఉండటానికి సరిపడా నీరు, ద్రవ పదార్థం అందించండి. రోజుకు కనీసం 8 గ్లాసుల నీరు ఇవ్వండి.

పైకి.. కిందకి..గంటల కొద్దీ చదవడం, అదే పనిగా గ్యాడ్జెట్లను చూస్తూ కూర్చోవడం .. కళ్లపై ఒత్తిడిని పెంచుతుంది. రెండు కళ్లనూ పైకీ, కిందకీ నెమ్మదిగా పలుమార్లు తిప్పాలి. తర్వాత అన్ని మూలలూ కలిసేలా గుండ్రంగా తిప్పాలి. ఇలా మూడు సెట్లలా చేయిస్తే చాలు. ఈ వ్యాయామం కంటిని ఆరోగ్యంగా ఉంచుతుంది.

శీతాకాలం ఎండ తక్కువగా ఉన్నా.. యూవీ కిరణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి కంటికి హాని చేస్తాయి. మీ చిన్నారి కంటిని రక్షించడానికి.. వాళ్లు కూలింగ్ గ్లాసెస్ ధరించేలా చూసుకోండి. కళ్లద్దాలు.. పొగమంచు, వాయు కాలుష్యం నుంచి కూడా వారి కళ్లను రక్షిస్తాయి. రెండు అరచేతులను ఒకదానికొకటి మృదువుగా రుద్దుకొని కాస్త వేడి పుట్టగానే వాటిని కళ్లపై ఉంచుకోమని చెప్పాలి. దీంతో కళ్లకు రక్తప్రసరణ బాగా జరుగుతుంది. దృష్టి సంబంధిత సమస్యలు రావు. ఇలా 15 సార్లు చేయించాలి. ఆపై మనసులో ఏదైనా ఒక వస్తువును తలచుకుంటూ కళ్లు మూసుకొని అయిదు నిమిషాలు ధ్యానం చేయమనండి. ఇదీ కళ్ల ఆరోగ్యాన్ని రక్షిస్తుంది.



# ఇక 'పంచాయతీ' పోరు!

**పంచాయతీకి వేళాయె!**

**రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు**

**నేడు హైకోర్టులో జరిగే పరిణామాలే కీలకం**

## రిజర్వేషన్లపై గెజిట్ నోటిఫికేషన్ జారీ

**రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆదేశాల మేరకు ఎన్నికల కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్లపై కలెక్టర్లు సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదికను ప్రామాణికంగా తీసుకొని 50 శాతంలోపే రిజర్వేషన్లకు ఎంపిక చేసిన స్థానాలను ఇందులో వెల్లడించారు. వీటని క్రోడీకరించి పంచాయతీరాజ్‌శాఖ పూర్తిస్థాయి నివేదికను ఎన్నికల సంఘానికి సోమవారం సాయంత్రం అందజేసింది. జిల్లాల్లోని పంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను కూడా సమర్పించింది.**

హైదరాబాద్: రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూలు, నోటిఫికేషన్ జారీకి రంగం సిద్ధమైంది. 31 జిల్లాల్లోని 545 గ్రామీణ మండలాల్లోని 12,760 పంచాయతీలు, 1,13,534 వార్డుల్లో నోటిఫికేషన్ జారీ కానుంది. ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూలు వెలువరించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేపట్టింది. మంగళవారం వెలువడే హైకోర్టు తీర్పు, మంత్రిమండలి నిర్ణయాలకు అనుగుణంగా కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించింది. దీంతో బుధ లేదా గురువారం షెడ్యూలు, నోటిఫికేషన్ వెలువడే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు అనుమతినివ్వగా.. పంచాయతీరాజ్‌శాఖ, ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేపట్టాయి.

**నేడు ఎన్నికల పిటిషన్లపై విచారణ**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన పిటిషన్లపై మంగళవారం హైకోర్టులో విచారణ జరగనుంది. వాస్తవానికి సోమవారమే విచారణ జరగాల్సి ఉండగా.. మంగళవారానికి వాయిదా పడింది. పాత రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని హైకోర్టుకు వెల్లడించేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఇప్పటికే రాష్ట్ర అడ్వొకేట్ జనరల్‌కు నివేదిక సమర్పించింది. మంగళవారం జరిగే మంత్రిమండలి సమావేశంలో చర్చించి పంచాయతీ ఎన్నికల తేదీలను ఖరారు చేయాలని యోచిస్తోంది. ఇప్పటికే మూడు దశల్లో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ప్రతిపాదనలు సమర్పించగా..

వాటిని ప్రభుత్వం పరిశీలించింది. మరోవైపు మంగళవారం వడ్డీలేని రుణాల చెక్కుల పంపిణీని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖలు చేపట్టనున్నాయి.

ఈ నేపథ్యంలో ఆరోజు ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశాలున్నప్పటికీ. హైకోర్టు ఆదేశాలు, రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయాలను పరిగణనలోకి తీసుకొని బుధవారం

లేదా గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

# తెలంగాణలో మొదలవుతున్న పంచాయితీ !

పంచాయితీ ఎన్నికలే లక్ష్యంగా అధికార పార్టీల పావులు కదుపుతోంది. రెండుమూడు రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కొడంగల్ సభలో స్వయంగా ప్రకటించారు. ఇప్పటికే ఇందిరమ్మ చీరల పంపిణీ మొదలయ్యింది. ఊరూవాడా ఈ జాతర సాగుతోంది. మంగళవారం నుంచి మహిళలకు వడ్డీరహిత రుణాల జాతర మొదలయ్యింది. నియోజకవర్గాల వారీగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ పనిలో పడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల వ్యవహారం మరోవైపు సాగుతోంది. ఇదంతా కేవలం పంచాయితీ ఎన్నికల కోసమే అని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ క్రమంలో బిసి రిజర్వేషన్లు వెనక్కి పోయాయి. పార్టీపరంగా 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించారు. ఉరిమురిమి మంగళం మీద పడ్డట్లు రిజర్వేషన్లు అమలు కాకపోవ డానికి బిజెపి కారణమని తప్పించుకోజూస్తున్నారు. 42శాతం రిజర్వేషన్ల హామీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది. దానిని ఎలా అమలు చేస్తారో కూడా తెలియకుండా నానా రకాల ఫీట్లు చేసి, చివరకు కోర్టుల్లో భంగపాటుకు గురయ్యారు. కేంద్రం ఆమోదించకపోవడం వల్లనే ఇలా జరిగిందని సాకులు చూపారు. నిజంగానే రిజర్వేషన్ల వ్యవహారం ఎలా ఉంటుందో తెలియంది కాదు. 50 శాతంనకు మించి రిజర్వేషన్లు అమలు చేయడం కుదరదు. దీనికి నిబంధనలు ఉన్నాయి. అవన్నీ పక్కన పెట్టి లాయర్లకు, కోర్టులకు డబ్బులు తగలేసి, చివరకు ఎన్నికలు ఆసల్యంగా జరపడానికి సిద్ధం అయ్యారు. అదికూడా నిధులు రాకపోతే ఎలా అన్న మీమాంసలో ముందుకు వెళ్లడం తప్ప చిత్తశుద్ధితో కాదు. పంచాయితీల పాలన ముగిసి దాదాపు రెండేళ్లు కావస్తోంది. ఈ క్రమంలో బిసి రిజర్వేషన్ల పేరిట నానా హంగామా చేసి, ఇప్పుడు మళ్లీ పాతపద్దతి లోనే పంచాయితీ ఎన్నికలకు సిద్ధం అయ్యారు. మొత్తంగా ఇదంతా ఊహించినట్టే జరిగింది. 42 శాతం కోటా పేరిట ఊదరగొట్టి.. చివరికి పాత పద్ధతిలో 25 శాతానికి బీసీ కోటాను పరిమితం చేసి ఎన్నికలకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. ఇకపోతే బిసి కులగణన పేరుతోనూ నానా విధాలుగా వక్రీకరణలు జరిగాయి. అసలు సర్వే సంపూర్ణంగా సాగలేదు. 1948 చట్టం ప్రకారం జనాభా గణన చేపట్టే అధికారం కేంద్రానికి మాత్రమే ఉన్నది. ఎలాంటి జనగణన నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు లేవు. ఒకవేళ చేసినా ఆ గణాంకాలకు చట్టబద్ధత ఉండకపోవడమేగాక, అమలు చేసే అవకాశం కూడా లేదు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వమే గణాంకాల సేకరణ చట్టం–2008 ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు డాటా సేకరణకు కొన్ని పరిమిత అధికారాలను బదలాయించింది. ఒకవేళ రాష్ట్రం నిర్వహించాలని భావించినా అందుకు కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. అంతేకాదు, సేకరించిన డాటా వెల్లడిపై కూడా అనేక ఆంక్షలను విధించింది. రాష్ట్ర ప్రభుత్వం పేరుకు ఇంటింటి సర్వే అని చెప్పి రాష్ట్రవ్యాప్తంగా జనాభాగణననే నిర్వహించి అందరినీ మభ్యపెట్టిందని విపక్షాలు ఇప్పటికే ఆరోపించాయి. కేంద్రం సర్వేకు అంగీకరించడంతో అదీ తమ ఘనతే అని చెప్పు కున్నారు. కేంద్రం మెడలు వంచామని బుకాయించారు. రాహుల్ నామ జపంతో సమస్యలు పక్కదారి పట్టిస్తున్నారు. మొత్తంగా ఇప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాల రిజర్వేషన్ల ఖరారులో పూర్తి గందరగోళం నెలకొన్నది. సర్కారు జారీచేసిన మార్గదర్శ కాలకు విరుద్ధంగా జిల్లాల్లో ఎక్కడికక్కడ అధికారులు ఇష్టారీతిన రిజర్వేషన్లను ఖరారు చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. తొలిదశలో నోటిఫికేషన్ జారీ చేసినప్పుడు ఎస్సీ, ఎస్టీలు ఒక్కరూ లేనిచోట కూడా ఆ వర్గాలకు స్థానాలను రిజర్వ్ చేయడం, పూర్తిగా ఎస్టీలే ఉన్నచోట ఇతర వర్గాలకు రిజర్వ్ చేయడం చూశాం. ఇప్పుడు కూడా అలాంటి విమర్శలే వస్తున్నాయి. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 50 శాతానికి మించకుండా ఎస్టీ, ఎస్సీ, బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల

జీవో–46ను విడుదల చేసింది. సర్పంచ్ స్థానాలకు ఆర్డీవోలు, వార్డు మెంబర్ల స్థానాలకు ఎంపీడీవోలు రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉన్నది. రిజర్వేషన్లను ఏప్రాతిపదికగా నిర్ణయించాలో సర్కారు మార్గదర్శ కాల్లో పేర్కొన్నది. జనాభా దామాషా ప్రకారం తొలుత ఎస్టీ, ఎస్సీ, బీసీ, తదుపరి మహిళా స్థానాలను ఖరారు చేయాల్సి ఉన్నది. ఆయా స్థానాలకు అనుగుణంగా గ్రామం, మండలం, జిల్లా, ఆపై రాష్ట్రం యూనిట్‌గా నిర్దేశిత కోటా ప్రకారం స్థానాలను రిజర్వ్ చేయాల్సి ఉంటుంది. సగం కంటే ఎక్కువ ఏ జనాభా ఉంటే ఆ వర్గానికి మొదటి ప్రాధాన్యంగా స్థానాలను రిజర్వ్ చేస్తూ వెళ్తుంటారు. ఇదీ ఆయా స్థానాల రిజర్వేషన్లకు అనుసరించే పక్రియ. ఎప్పుడూ ఇదే పద్దతిని అవలంబిస్తున్నారు. షెడ్యూల్డ్ ఏరియాలోనూ ఎస్టీలకు మొత్తం స్థానాల్లో సగానికి తగ్గకుండా ఉండాలి. వందశాతం ఎస్టీ జనాభా ఉన్నచోట మొత్తంగా వారికే కేటాయించాల్సి ఉంటుంది.ఇదిలా ఉంటే వార్డు మెంబర్ స్థానాలకు ఇంటింటి సర్వే–2024 లెక్కలను, సర్పంచ్ స్థానాలకు 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకొని ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని, ఇంటింటి సర్వే–2024 లెక్కలను పరిగణనలోకి తీసుకుని బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. దీంతో రిజర్వేషన్ల కేటాయింపు మొత్తంగా గందర గోళంగా మారిందని తెలుస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా సీట్లను అలాట్ చేశారనే విమర్శలొస్తున్నాయి. అనేకచోట్ల గందరగోళంగా జరిగిందంటూ ఆశావహులు ఇప్పటికే అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు. ఃుజర్వేషన్లలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతున్నదని బీసీ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే పలు జిల్లాల్లో సర్పంచ్, వార్డుమెంబర్ స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. అన్ని జిల్లాల్లో బీసీ కోటాను తగ్గించి జనరల్ కోటను పెంచారని బీసీ సంఘాలు చెప్తున్నాయి. రొటేషన్ ముసుగులో బీసీలకు రావాల్సిన సర్పంచ్ స్థానాలను అగ్రకులాలకు కట్టబెడుతున్నారని మండిపడుతున్నాయి. మొత్తంగా ఇప్పుడు వస్తున్న విమర్శలు, ఆందోళనలకు ప్రభుత్వం సమాధానం ఇచ్చుకోవాలి. అలాగే పారదర్శకంగా రిజర్వేషన్ల అమలు, ఎన్నికల నిర్వహణ జరగాలి. అప్పుడే ప్రభుత్వ నిజాయితీ కనిపిస్తుంది.

# ఆయుధాలు వదిలేస్తాం.



**మూడు రాష్ట్రాల సీఎం లకు మావోయిస్టుల లేఖ.**

**కానీ మూడు నెలల గడువు ఇవ్వండి.**

**కేంద్ర కమిటీలో చర్చించే నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడి.**

**హైదరాబాద్:** కూంబింగ్ ఆపేస్తే తాము కూడా ఆయుధాలు వీడుతామని మావోయిస్టు పార్టీ మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ రాసింది. ఎంఎంసీ జోనల్ కమిటీ పేరుతో విడుదలైన ఈ లేఖలో ప్రభుత్వాలు కూంబింగ్ ఆపేసి శాంతి చర్చ లకు ముందుకు రావాలని కోరారు. సెంట్రల్ కమిటీ సభ్యుడు వసంత్ సూచించిన మార్పు లను కేంద్ర కమిటీ ఆమోదించిన నేపథ్యంలో, తమ కార్యకలాపాల్లో కీలక నిర్ణయాలు తీసు కున్నట్లు పేర్కొన్నారు. ఆయుధాలు వదిలేసే అంశంలో సమష్టిగా నిర్ణయం తీసుకోవడానికి కొంత సమయం పడుతుందని, ఫిబ్రవరి 15, 2026 వరకు తమకు టైమ్ ఇవ్వాలని కోరారు. తాము సమయం అడిగే విషయంలో ఎలాంటి నిగూఢ ఉద్దేశం లేదని అన్నారు. ఈ కాలంలో మూడు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మావోయిస్టు ప్రాంతాల్లో జరిగే కూంబింగ్, దాడులు, ప్రత్యేక బలగాల ఆపరేషన్లను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంఎంసీ (మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్) జోనల్ కమిటీ కూడా ఆయుధాలు వదిలేసి జనజీవన స్రవంతిలోకి రావాలనుకుంటున్నదని పేర్కొంది. ఈ విషయంలో మహా రాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్ మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు తమకు సమయం ఇవ్వాలని అభ్య ర్థిస్తున్నామని పేర్కొన్నారు. మావోయిస్టుల అణి చివేతకు కేంద్రం మార్చి 31, 2026 వరకు గడువు విధించిందని... అప్పటి వరకు మూడు రాష్ట్ర ప్రభుత్వాలు సంయమనం పాటించాలని లేఖలో ప్రస్తావించారు. ప్రభుత్వాలు స్పందిస్తే.. శాంతి చర్చలకు మార్గం సుగమమవుతుందని అన్నారు. శాంతి ప్రక్రియకు ప్రభుత్వాలు కూడా ముందుకు రావాలని మావోయిస్టు పార్టీ కోరింది. భద్రతా దళాలు తమ ఆపరేషన్లను నిలిపితే, మేమూ పీఎల్ జీఏ వారోత్సవాన్ని నిర్వహించము.

# నిరంజన్ రెడ్డి అవినీతితోనే ఓడారు

**ఫామ్‌హౌజ్‌లు కట్టుకుని పార్టీకి చెడ్డపేరు**

**మాజీమంత్రిపై జాగృతి అధ్యక్షురాలు కవిత ఫైర్**



హైదరాబాద్: బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మాజీ మంత్రి చేసిన అవినీతికి వనపర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బపడిందని వ్యాఖ్యలు చేశారు. ఆయన మూడు నాలుగు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారని.. చెప్ప లేనంత అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎమ్మార్వో ఆఫీస్‌ను కాల్చేస్తే కూడా ప్రజలు ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని.. ఎదురు తిరిగిన 32 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి జైలుకు పంపారంటూ మాజీ మంత్రిపై ఫైర్ అయ్యారు. ఇలాంటి అవినీతిపరుడిని చిత్తుగా ఓడించడం సరైన నిర్ణయమన్నారు. వనపర్తి నియోజకవర్గంలో నిరంజన్ రెడ్డి రాచరిక పాలనను తలపించారని విమర్శించారు. ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వని నిరంజన్ రెడ్డి తనకు తాను నీళ్ల నిరంజనుడుగా పేరు మార్చుకున్నారంటూ ఎద్దేవా చేశారు. 'నా గురించి ఇంకొక్కసారి ఎక్కడైనా మాట్లాడితే నీ తాట తీస్తా ఒళ్ళు జాగ్రత్తగా పెట్టుకో' అంటూ నిరంజన్ రెడ్డికి కవిత ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు.

# రిజర్వేషన్లలో బిసిలకు న్యాయం దక్కేనా

**పంచాయితీల్లో బిసిల కోటాపై సర్వత్రా అనుమానాలు**

**పలుచోట్ల తప్పల తడకగా సాగిందంటూ నిరసనలు**

హైదరాబాద్: పంచాయితీ ఎన్నికలుకు సంబంధించి బిసి రిజర్వేషన్ల కేటాయింపులో గందరగోళం నెలకొన్నదని పలు బిసి సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీసీ కోటా గతం కంటే తగ్గిపోయింది. అన్ని జిల్లాల వివరాలను సేకరించి త్వరలోనే సీఎస్‌ను కలిసి ఫిర్యాదుచేస్తాం అని అంటున్నారు. న్యాయం చేయకుంటే కోర్టుల ద్వారా పోరాటం చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలోని బీసీ మంత్రులు, ప్రజాప్రతినిధులు ఈ అన్యాయంపై తక్షణం స్పందించాలని వారు కోరుతున్నారు. కోటా తగ్గింపునకు వ్యతిరేకంగా 30న చలో హైదరాబాద్ నిర్వహిస్తాం అని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. చాలా జిల్లాల్లో గతంలో కంటే బీసీ కోటా తగ్గిపోయినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయన్నారు. 42 శాతం రిజర్వేషన్లు దేవుడెరుగు కనీసం ఇప్పటికే ఉన్న బీసీ రిజర్వేషన్లకే రాష్ట్ర ప్రభుత్వం గండి కొడుతున్నదని మండిపడ్డారు. వాస్తవంగా 2019లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో బీసీలకు 18శాతం నుంచి 22.79 వరకు రిజర్వ్ అయ్యాయి.కానీ, ప్రస్తుతం రాష్ట్రంలో అనేక కొత్త పంచాయతీలు ఏర్పడినప్పటికీ,

ప్రస్తుతం బీసీలకు 16 నుంచి 20 శాతానికి మించి రిజర్వేషన్లు దక్కడంలేదని వివరిస్తున్నారు. అనేక డివిజన్లు, మండలాల్లో బీసీలకు ఒకటి కూడా సర్పంచ్ సీటు రిజర్వు కాలేదని, గత ఎన్నికల్లో కంటే కనీసం రెండు మూడు స్థానాల వరకు బీసీ కోటాను తగ్గించారని ఆందోళన వ్యక్తం చేసారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఖరారు చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేస్తూ జీవో–46 విడుదల చేసింది. సర్పంచ్ స్థానాలకు 2011 జనాభా లెక్కలను, వార్డు మెంబర్ స్థానాలకు 2024 ఇంటింటి సర్వే లెక్కలను పరిగణన లోకి తీసుకోవాలని స్పష్టంచేసింది. అయితే, రాష్ట్రాలు నిర్వహించిన కులగణన సర్వేలకు చట్టబద్ధత లేదని, పారదర్శకత ఉండబోదని, ఆ సర్వే గణాంకాలు చెల్లబోవని కేంద్రం ఇప్పటికే అనేకసార్లు స్పష్టంచేసింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇంటింటి సర్వే గణాంకాలను ప్రామాణికంగా తీసుకోవాలని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. జనాభాగణన అంశం 7వ షెడ్యూల్‌లో కేంద్ర జాబితాలోని అంశం. గణాంకాల సేకరణ చట్టం–2008 ప్రకారం సర్వే నిర్వహించాలన్నా కొన్ని నిబంధనలను పాటించాల్సి ఉన్నది. స్వయం ప్రతిపత్తి కలిగిన కమిషన్‌ను ఏర్పాటు చేయడంతోపాటు గణాంకాల సేకరణకు ఒక ప్రభుత్వ శాఖను నోడల్ డిపార్ట్‌మెంట్‌గా నియమించాలి. నేషనల్ ప్లానింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్ డిపార్ట్‌మెంట్, స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్, ఎన్ఎస్ఎస్‌వో తదితర విభాగాల నుంచి రాష్ట్రానికి చెందిన తాజా ఇండ్ల జాబితాను, బ్లాక్‌వారీ గా రూపొందించిన హౌసింగ్ మ్యాపులను కూడా తీసుకోవాల్సి ఉంటుంది. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలకు సంబంధించిన స్థితిగతులను తులనాత్మక అధ్యయనం చేయాల్సి ఉంటుంది. తుదకు అన్నింటినీ క్రోడీకరించి, విశ్లేషించి తుదకు కేంద్రం ఆమోదంతో ఆ గణాంకాలను ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకునే అవకాశముంటుంది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ.160 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో 2024 నవంబర్‌లో ఇంటింటి సర్వే నిర్వహించింది. రాష్ట్రంలో మొత్తంగా 3.7 కోట్ల మంది జనాభా ఉండగా, అందులో 96.9శాతం మందిని సర్వే చేసి వివరాలను సేకరించిందని అంటున్నారు. ఆ లెక్కనే 100 శాతం కరెక్టని కాంగ్రెస్ చెప్పుకుం టోందని అంటున్నారు. అయితే స్థూలంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ వర్గాల గణాంకాలనే బయటపెట్టింది. కులాలు, ఉపకులాల వారీగా వివరాలను మాత్రం గోప్యంగా దాచిపెట్టింది. పూర్తిస్థాయి నివేదికను వెల్లడించకపోవడం, అభ్యంతరాలను స్వీకరించకపోవడంతో సర్వే గణాంకాలకు సాధికారత లేకుండా పోయిందని పలు బిసి నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కానీ, తాజాగా ఆ గణాంకాలనే ప్రామాణికంగా తీసుకుని స్థానిక రిజర్వేషన్లు ఖరారు చేయాలని మార్గదర్శకాలు జారీచేయడంపై చర్చ కొనసాగుతున్నది. కులగణన అంశం పూర్తిగా కేంద్రం పరిధిలోనిదేనని కేంద్రం గతంలోనే స్పష్టంచేసింది. దేశవ్యాప్తంగా చేపట్టబోయే జనాభా గణనలో కులగణనను కూడా నిర్వహించా లని ఆ కమిటీ నిర్ణయించింది. అందుకు సంబంధించి షెడ్యూల్ ను కూడా ఇప్పటికే ప్రకటించింది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 2024 ఇంటింటి సర్వే గణాంకాలను ప్రామాణికంగా తీసుకోవడం ఇప్పుడు అనేక వివాదాలకు తావిస్తున్నది. ఈ క్రమంలో యా స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల రొటేషన్ పక్రియను సైతం నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారనే ఆరోపణలొస్తున్నాయి. 2019కి ముందు ఏర్పడిన పంచాయతీలు, మండలాలు, జిల్లాలకు మాత్రమే రొటేషన్ వర్తిస్తుంది.

# సింగర్ జుబీన్ గార్గ్‌ది ముమ్మాటికీ హత్యే

**అసెంబ్లీలో అసోం సిఎం బిస్వశర్మ వ్యాఖ్య**

గౌహతి: ప్రముఖ సింగర్ జుబీన్ గార్గ్ మరణంపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. జుబీన్ గార్గ్ ప్రమాదవశాత్తూ చనిపోలేదని.. అతడిని హత్య చేశారంటూ అసెంబ్లీ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో కూడా ఆయన మీడియా ముందు ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ సారి శాసన సభ వేదికగా జుబీన్ మరణంపై సీఎం హిమంత ఈ సంచలన కామెంట్స్ చేయడం సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. మంగళవారం అస్సాం అసెంబ్లీలో గార్గ్ మరణం గురించి చర్చించడానికి ప్రతిపక్షాలు వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఈ సందర్భంగా సీఎం హిమంత బిస్వా శర్మ మాట్లాడుతూ.. జుబీన్ గార్గ్ ది ప్రమాదం కాదని, ఆయన్ను చంపేశారని ఆరోపించారు. మరోవైపు గార్గ్ మరణంపై దర్యాప్తు చేస్తున్న ఏకసభ్య కమిషన్ వాంగ్మూలాలు నమోదు చేయడానికి, సాక్ష్యాలను సమర్పించడానికి గడువును డిసెంబర్ 12 వరకు పొడిగించింది. గౌహతి హైకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ సౌమిత్ర సైకియా నేతృత్వంలోని కమిషన్ నవంబర్ 3 నుంచి విచారణను ప్రారంభించింది. దీనికి సంబంధించిన నివేదికను సమర్పించే గడువు నవంబర్ 21తో ముగిసింది. దీంతో గడువును డిసెంబర్ 12 వరకు పొడిగిస్తూ ఏకసభ్య కమిషన్ సోమవారం నిర్ణయం తీసుకుంది. గార్గ్ మరణంపై అసలు విషయాలు తెలుసుకునేందుకు అస్సాం ప్రభుత్వం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ప్రముఖ సింగర్ జుబీన్ గార్గ్ సెప్టెంబర్ 19న మరణించిన విషయం తెలిసిందే. సింగపూర్ వెళ్లిన జుబీన్ అక్కడ ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఆయన మరణంపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో సీఎం హిమంత బిశ్వ శర్మ ఆదేశాల మేరకు జుబీన్ మృతిపై ఏకసభ్య కమిషన్ దర్యాప్తు ముమ్మరం చేసింది.

# ఢాకాకు హసీనా అప్పగింత


**భారత నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి**

ఢాకా: తమ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్‌ను తమకు అప్పగించాలని కోరుతు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు లేఖ పంపింది. ఈ క్రమంలో భారత్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది సర్వత్రా ఆసక్తిగా మారింది. ప్రపంచదేశాలు కూడా దీనిపై ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఈ విషయాన్ని ఆ దేశ ప్రభుత్వ విదేశాంగ శాఖ సలహాదారు తౌహిద్ హుస్సేన్ వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో అల్లర్ల నేపథ్యంలో హసీనా భారత్‌లో తలదాచుకుంటున్న సంగతి తెలిసిందే. హసీనా పదవీకాలంలో అనేక మంది రాజకీయ కార్యకర్తలు, విమర్శకులు అదృశ్యమయ్యారనే కేసులో బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసిటి) ఆమెకు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పు అమలులో భాగంగా భారత్‌కు బంగ్లాదేశ్ ఈ లేఖ పంపినట్లు హుస్సేన్ తెలిపారు. తీర్పు వివరాలు ఉన్న లేఖను కూడా భారత్‌కు పంపినట్లు ఆయన వెల్లడించారు. అసదుజ్జమాన్‌ను కూడా మరణ శిక్ష విధించినయ విషయాన్ని కూడా భారత్‌కు తెలిపామన్నారు.. 'ఈ ఇద్దర్నీ ఆలస్యం చేయకుండా బంగ్లాదేశ్ అధికారులకు అప్పగించాలని మేము భారత ప్రభుత్వాన్ని కోరుతున్నాము.




# కెవిఎన్ ప్రొడక్షన్‌లో రావిపూడి

ఈతరం దర్శకుల్లో దర్శకుడు అనిల్ రావిపూడి వినోదం ప్రధానంగా ఆయన సినిమాలుంటాయి. ఈ ఏడాది సంక్రాంతికి వెంకటేశ్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నారు. వచ్చే ఏడాది మెగాస్టార్ చిరంజీవితో 'మన శంకర వరప్రసాద్‌గారు' సినిమాతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే తాజాగా ఆయన గురించి ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతుంది. దక్షిణాదిలో భారీ సినిమాలు చేస్తున్న కెవిఎన్ ప్రొడక్షన్‌లో ఓ సినిమా చేయబోతున్నారని వార్తలొచ్చాయి. ఆ వార్తలు నిజమే అన్నట్లు ఆదివారం అనిల్ రావిపూడి పుట్టినరోజు సందర్భంగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ నిర్మాణ సంస్థ ఓ పోస్ట్ పెట్టడంతో ఈ కాంబోలో సినిమా ఖాయమని క్లియర్ అయింది. అయితే ఇందులో హీరో ఎవరు? అనే వివరాలు వెల్లడించలేదు. ఇదే బ్యానర్‌లో చిరంజీవి - బాబీ కొల్లి సినిమా, యష్, విజయ్ ప్రాజెక్టులు ఉన్నాయి. అలాగే పవన్‌కల్యాణ్, లోకేశ్ కనకరాజ్ కాంబోలో కూడా ఓ సినిమా ఉంటుందని టాక్ నడుస్తోంది.




# సంక్రాంతి రేసు నుంచి తప్పుకున్న నవీన్ పోలిశెట్టి?

యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి, మీనాక్షీ చౌదరి జంటగా మారి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం అనగనగా ఒక రాజు. సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్య దేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, ప్రమోషనల్ కంటెంట్ అంతా మంచి ఆదరణను అందుకున్నాయి. ఎన్నో ఏళ్లగా ఈ సినిమా రిలీజ్ కోసం ఎదురుచూస్తూ ఉంది. ఎట్టకేలకు వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో రాజుగారు దిగుతున్నారు అంటూ మేకర్స్ ప్రకటించారు. దీంతో అందరూ ఈ సినిమా కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. ఈ మధ్యనే నవీన్ పోలిశెట్టి ప్రమోషన్స్ తో అదరగొట్టాడు. అయితే అది కూడా మూడునాళ్ళ ముచ్చటగా మారిపోయింది. అందుతున్న సమాచారం ప్రకారం ఈ సంక్రాంతి బరిలో కూడా రాజుగారు రావడం లేదని తెలుస్తోంది. చిరంజీవి మన శంకరవరప్రసాద్ గారు, ప్రభాస్ ది రాజా సాబ్, రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి, విజయ్ జన నాయగన్, శర్వానంద్ నారీ నారీ నడుమ మురారి లైన్ లో ఉన్నాయి. ఇక ఇన్ని సినిమాలతో పోటీ తట్టుకోలేక రాజుగారు డ్రాప్ అయ్యారని, సంక్రాంతి రేసు నుంచి నవీన్ తప్పుకున్నాడని వార్తలు వస్తున్నాయి. అందుకే ప్రమోషన్స్ కూడా మధ్యలోనే ఆపేశారని సమాచారం. త్వరలోనే ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా తెలపనున్నారట.



## నటి శ్రద్ధాకపూర్‌కు గాయం

నటి శ్రద్ధాకపూర్ ప్రస్తుతం 'ఈఠా'లో నటిస్తోన్న సందర్భంగా ఇటీవల ఈ సినిమా షూటింగ్‌లో ఆమె కాలుకు గాయమైంది. దీంతో అభిమానులు ఆందోళన చెందారు. తాజాగా తన హెల్త్ అప్‌డేట్‌ను శ్రద్ధా పంచుకున్నారు. విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక అభిమాని గాయం ఎలా ఉందని పోస్ట్ పెట్టగా దానికి ఆమె రిప్లై ఇచ్చారు. 'పెద్ద దెబ్బ ఏం కాదు.. కాలి కండరానికి దెబ్బ తగిలి కొంచెం ఫ్రాక్చర్ అయింది. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారు.
నేను క్షేమంగానే ఉన్నా.



# విడుదలకు ముందే పెద్ది రికార్డులు

## చికిరి చికిరి పాటకు వందమిలియన్ వ్యూస్

విడుదలకు ముందే రికార్డులను తన ఖాతాలో వేసుకుంటోంది 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. దానికి కారణం ఇటీవల విడుదలైన 'చికిరి చికిరి' పాటనే. ఈ పాట రికార్డు స్థాయిలో వ్యూస్‌ను సొంతం చేసుకుంటోంది. 16 రోజుల్లో అన్ని భాషల్లో కలిపి 100 మిలియన్ల వ్యూస్‌ను (10 కోట్ల వ్యూస్) సొంతం చేసుకున్నట్లు టీమ్ తాజాగా తెలిపింది. దీంతో రామ్‌చరణ్ అభిమానులు సంబరపడుతున్నారు. మరోవైపు ఈ పాటలోని హుక్‌స్టెప్ కూడా బాగా వైరలవుతోంది. దీన్ని ఏకంగా సోషల్ మీడియాలో 5 లక్షల మందికి పైగా రీక్రియేట్ చేసినట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. ఇన్‌స్టా, యూట్యూబ్‌లో కలిపి ఇంతమంది దీన్ని రీల్స్ చేసినట్లు వెల్లడించింది. అలాగే హీరో నితిన్ కుమారుడు కూడా ఈ పాటకు చేతులు కదుపుతూ ఎంజాయ్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. చికిరి చికిరి... అంటూ సాగే ఈ సాంగ్‌ను ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరపరచగా, మోహిత్ చౌహాన్ ఆలపించారు. బాలాజీ సాహిత్యం అందించారు. ఇందులో జాన్వీకపూర్ అచ్చియ్యమ్మగా కనిపించనున్నారు.



# ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా రాజాసాబ్

పాట విడుదల సందర్భంగా దర్శకుడు మారుతి


ఎన్టీఆర్ అభమానులకు క్షమాపణలు

ప్రభాస్ అభిమానులు తనపై పెట్టుకున్న నమ్మకానికి మించి 'ది రాజాసాబ్' ఉంటుందని దర్శకుడు మారుతి అన్నారు. ప్రభాస్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ది రాజాసాబ్'. తాజాగా ఈ సినిమా నుంచి 'రెబల్ సాబ్' అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ.. ఈ చిత్రం విడుదలైన రోజు థియేటర్లు కేరింతలతో మార్మోగిపోవడం ఖాయమన్నారు. అందుకు తనదే హామీ అని చెప్పారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా కనిపించనున్న ఈ చిత్రం జనవరి 9న విడుదల కానుంది. ప్రభాస్ కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్' సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ఒక్కో అప్‌డేట్ ఇస్తోంది. ఈ సినిమా నుంచి మొదటి పాట 'రెబల్ సాబ్'ను విడుదల చేసింది. తమన్ స్వరాలు సమకూర్చిన పాట ప్రస్తుతం ట్రెండ్ అవుతోంది.

ఇకపోతే మారుతి వివాదంలో చిక్కారు. మైక్ ముందు ఉంది కదా అని ఏదో ఒకటి అనేస్తున్నారు.. ట్రోల్స్ కు గురవుతున్నారు.. మళ్లీ తిరిగి క్షమాపణలు కోరుతున్నారు. తాజాగా డైరెక్టర్ మారుతీ.. ఎన్టీఆర్ ఫ్యాన్స్ కు క్షమాపణలు చెప్పాడు.రిలీజ్ డేట దగ్గరపడుతుండడంతో ప్రమోషన్స్ మొదలుపెట్టిన మారుతీ.. రాజా సాబ్ నుంచి రెబల్ సాబ్ అంటూ సాగే సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్ లో మారుతీ.. ఎన్టీఆర్ ని అవమానించడంటూ ఫ్యాన్స్ రచ్చ చేయడం మొదలుపెట్టారు. ఈ ఈవెంట్ లో మారుతీ మాట్లాడుతూ.. 'కాలర్ ఎగరేసుకుంటారు.. అట్లా చెప్పను. ఎందుకంటే అవ్వన్నీ ఆ కట్ అవుట్ ముందు చాలా చిన్నవి అయిపోతాయి. నేను ప్రస్తుతం రెబెల్ యూనివర్సిటీలో చదువుకుంటున్నా. ప్రభాస్ ఫోటో జేబులో ఉంటే చాలు ఎలాంటి డైరెక్టర్ అయిన టాప్ డైరెక్టర్ అయిపోతాడు' అంటూ చెప్పుకొచ్చాడు. వార్ 2 ఈవెంట్ లో ఎన్టీఆర్ ఇలానే కాలర్ ఎగరవేసి తమ సినిమా హిట్ అవుతుందని చెప్పాడు. ఇప్పుడుమారుతీ ఎన్టీఆర్ నే అన్నాడని, తమ హీరోని పొగడడంలో తప్పు లేదు కానీ, వేరే హీరోతో కంపేర్ చేయడం .. ఆ హీరోని అవమానించడమే అని చెప్పుకొస్తున్నారు. ఇక ఈ విషయం పెద్దది కాకుండా మారుతీ ఆదిలోనే తుంచేశాడు. ఫ్యాన్స్ కి సారీ చెప్పి ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టాడు. ' ముందుగా నేను ప్రతి అభిమానికి హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నాను. ఎవరినీ బాధపెట్టడం లేదా అగౌరవపరచడం నా ఉద్దేశ్యం కాదు. కొన్నిసార్లు మాటల ప్రవాహంలో మనం అనుకున్న మాటలు అనుకున్నట్లు రాకపోవచ్చు. నేను అన్న మాటలు వేరే విధంగా అర్థం చేసుకున్నందుకు నేను చింతిస్తున్నాను.ఎన్టీఆర్ గారి పట్ల మరియు ఆయన అభిమానులందరి పట్ల నాకు అపారమైన గౌరవం ఉంది. సినిమా పట్ల,మీ హీరో పట్ల మీరు చూపే ప్రేమకు నేను నిజంగా విలువ ఇస్తున్నాను. ఇది నేను ఉద్దేశ్యపూర్వకంగా చేయలేదని మనస్ఫూర్తిగా చెప్తున్నాను. ఈ విషయాన్ని అభిమానులు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను' అంటూ చెప్పుకొచ్చాడు.

# ఫిబ్రవరి13న స్వయంభు విడుదల

## భారీ అంచనాలతో నిర్మాణం




ఒక సినిమా.. రెండు సంవత్సరాల కష్టం.. పదుల సంఖ్యలో సెట్స్.. వేల సవాళ్లు..' అంటూ 'స్వయంభు' విడుదల తేదీని ప్రకటించారు హీరో 'నిఖిల్'. ఆయన ప్రధానపాత్రలో భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. సంయుక్త, నభా నటేశ్ కథానాయికలు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 13న విడుదల కానున్నట్లు తెలుపుతూ వీడియో విడుదల చేశారు. హీరో నిఖిల్ సిద్దార్థ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న పీరియడ్ వార్ యాక్షన్ డ్రామా 'స్వయంభు' మరోసారి వార్తల్లోకి వచ్చింది. కొంతకాలంగా చిత్ర బృందం నుంచి ఎలాంటి అప్డేట్ రాకపోవడంతో ఫ్యాన్స్ నిరుత్సాహంలో ఉన్నారు. అయితే , ఈ రోజు మేకర్స్ చిత్రం విడుదల తేదీని ప్రకటించారు. 'కార్తికేయ 2'తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన నిఖిల్ ఇప్పుడు మళ్లీ పాన్ వరల్డ్ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. మొదటిసారి దర్శకుడిగా మారుతున్న భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ డ్రామా వచ్చే ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. సినిమా మొత్తం ఎనిమిది భాషల్లో విడుదల కానుంది.తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం, చైనీస్, స్పానిష్, అరబిక్ భాషలలో మూవీని రిలీజ్ చేయనున్నారు. సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని టీమ్ వెల్లడించింది. విడుదల తేదీ ప్రకటించిన సందర్భంగా, మేకర్స్ 'రైజ్ ఆఫ్ స్వయంభు' అనే స్పెషల్ వీడియోను రిలీజ్ చేశారు.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,